శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ నజీర్

తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన గవ్నర్‌కు టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపుఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ,ఆలయ అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు దినపత్రిక
30 వార్త 30 వార్షికోత్సవం
వార్త

వేదోక్తంగా వసంతోత్సవ తిరుమంజనం

తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:

వసంతోత్సవ మండపంలో మలయప్ప సాలకట్ల వసంతోత్సవాలలో మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామికి వేదోక్తంగా స్నపన తిరుమంజనం జరిగింది. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అక్కడ నుండి స్వామి, అమ్మవార్లు సాయంత్రం ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దంపతులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ

బంగారురథం ఎత్తు పెంపు

ప్రభుత్వం కేటాయించిన 18.60 ఎకరాలకు సరిహద్దులు ఏర్పాటు

-దళిత సత్రానికి ప్రత్యామ్నాయ కేటాయింపులు

-పాలక మండలి ఏకగ్రీవ తీర్మానం

కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఊరేగే బంగారురథంను భక్తులందరూ వీక్షించే విధంగా రథం ఎత్తును పెంచాలని దేవస్థానం పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి చైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సంభందించి 16 అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాలకమండలిలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లతో కలసి సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా స్వామివారు ఊరేగే బంగారురథం కార్యక్రమంను భక్తులందరూ కనులారా వీక్షించే విధంగా రథం ఎత్తును రెండున్నర అడుగుల వరకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తిరుపతి-బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్డులోని పట్నం వద్ద ప్రభుత్వం దేవస్థానంకు కేటాయించిన 18.60 ఎకరాల భూమిని సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు వారు తెలిపారు. ప్రధానంగా దళితసత్రంకు ప్రత్యామ్నాయంగా దళిత ఉభయదారులకు దేవస్థానంకు సంభందించిన శ్రీమరగధాంభిగా కళ్యాణ మండపంలో ప్రస్తుతం ఇచ్చిన ఒక బ్లాక్‌తో పాటు అదనంగా మరో బ్లాక్‌ను ఇవ్వడంతో పాటు 50 లక్షల రూపాయలను, మరమ్మత్తుల కోసం మరో 10 లక్షల రూపాయలను ఇవ్వాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ఈఈ వెంకటనారాయణ,డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ప్రసాద్, హరి మాధవరెడ్డి, ఎస్వీ. కృష్ణారెడ్డి, ధనుంజయ,సీఎఫ్ఓ నాగేశ్వరరావులతో పాటు బోర్డు సభ్యులు నాగరాజులు నాయుడు, నరేష్, శివప్రసాద్, కత్తి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సతీష్, చంద్రకళ, వసంతమ్మ, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి, సూపరింటెండెంట్‌లు కోదండపాణి, వాసు, బాలరంగస్వామి, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు అవకాశం: కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రొత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపుకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కల్గిన సిబ్బంది నిమిత్తం సంబంధిత పరిశ్రమలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు అనుమతి కోసం 9 ప్రదేశాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుండి మార్చి 30 వరకు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మొత్తం 781 దరఖాస్తులు అందగా వాటిలో 753 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో లీగల్ మెట్రాలజీ శాఖలో అత్యధికంగా 714 దరఖాస్తులు అందగా ఇందులో 711 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయన్నారు. అలాగే 414 పిఎంఇజిపి లబ్దిదారులకు రూ.43 కోట్లతో సుమారు వంద యూనిట్లు గ్రౌండ్ చేయడం జరిగిందన్నారు. అలాగే మహిళలు, యువత, చిన్న వ్యాపారులు, వ్యాపార మార్గంలో తొలిసారి ప్రయత్నించే వారికి ఎక్కువ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, జెడ్ఎం సుబ్బారావు, ఎల్‌డిఎం హరీష్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి, గ్రౌండ్ వాటర్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.9 లక్షల పాగాకు ఉత్పత్తులు

అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్టు

గుడిపాల, మార్చి 31 ప్రభాతవార్త:

గుడిపాల పోలీస్ స్టేషన్ పరిధిలో 9 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులు అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా వున్నాయి. ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది సోమవారం రాత్రి పసుమంద క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో చిత్తూరు నుండి తమిళనాడు వైపుకు వెళ్తున్న ఓ ఆటో వచ్చింది. ఈ ఆటో పోలీసుల తనిఖీలు చూసి తప్పించుకుని పారిపోవడానికి డ్రైవర్ ప్రయత్నించడంతో పోలీసులు ఆటోను వెంబడించి తనిఖీలు చేశారు. ఆటోలో పోలీసులు 24 గుట్కా సంచులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని ఆటోలో ప్రయాణిస్తున్న గుడిపాల మండలం బొమ్మసముద్రం గ్రామంకు చెందిన కిరణ్, మంజునాథ్, సురేష్‌లను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ఎంతటి భాగ్యమో శ్రీనివాసా!

మహిళా భక్తులే అశ్వాలుగా కదిలిన స్వర్ణరథం

తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరపరమాత్ముడే బంగారురథాన్ని అదిరోహించగా మహిళా భక్తులు అశ్వాలుగా మారి గోవిందనామంతో రథాన్ని లాగి పునీతులయ్యారు. సాలకట్ల వసంతోత్సవాల్లో మంగళవారం ఉదయం శ్రీదేవిభూదేవిసమేతుడైన మలయప్ప బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీవేంకటేశ్వరుని దర్శించిన భక్తులు గోవిందనామంతో తన్మయత్వంపొందారు. స్వర్ణరథోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దంపతులు,సివిఎస్ఓ మురళీకృష్ణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ, మహిళా ఉద్యోగులు, శ్రీవారిసేవకులు, అర్చకులు,వేదపండితులు పాల్గోన్నారు.

బ్లాక్‌లో గ్యాస్ అమ్మకాలు

- వినియోగదారుల ఆవేదన

యర్రావారిపాలెం, మార్చి 31, ప్రభాతవార్త:

యర్రావారిపాలెం మండలంలో గ్యాస్ సరఫరాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని గ్యాస్ గోడౌన్‌లో గ్యాస్ కొరత లేకపోయినా, నిర్వాహకులు గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అవసరమైన వినియోగదారులకు సరఫరా చేయకుండా అధిక ధర చెల్లించే వారికి గ్యాస్‌ను మళ్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల కథనం మేరకు గ్యాస్ కోసం ఫోన్ ద్వారా బుకింగ్ చేసిన తర్వాత ఓటీపీ వస్తుందని చెబుతున్నప్పటికీ, రెండు మూడు రోజులు గడిచినా ఓటీపీ రావడం లేదని అంటున్నారు. ఈ కారణంగా గ్యాస్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. మొదట టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఆ తర్వాత క్రమసంఖ్య ప్రకారం ఓటీపీ వస్తుందని చెప్పి పంపిస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క గ్యాస్ సిలిండర్ ఇవ్వాల్సి ఉండగా, ఒకేసారి ఆటో నిండుగా గ్యాస్ సిలిండర్లు ఖాళీ సిలిండర్లు వేసుకొని వచ్చి ఫుల్ సిలిండర్లు ఎత్తుకొని వెళ్ళిపోతున్నారని అన్నారు. అయితే వాస్తవానికి గ్యాస్ అందుబాటులో ఉన్నప్పటికీ, కొంత మంది వ్యక్తులకు అధిక ధరకు బ్లాక్‌లో విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నారని వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతుండగా, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ వ్యవహారంపై చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత గ్యాస్ గోడౌన్‌పై దర్యాప్తు జరిపి, తప్పిదం నిరూపితమైతే లైసెన్స్ రద్దు చేసి, అర్హులైన వారికి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే వినియోగదారులకు సకాలంలో గ్యాస్ అందేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గరుడవాహనంపై ఊరేగిన

శ్రీసీతా సమేత కోదండరాముడు



తవణంపల్లె, మార్చి 31 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ వెలసిన శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం శ్రీసీతా సమేతుడైన కోదండరాముల స్వామి గరుడవాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అలరించారు. మంగళవారం రాత్రి స్వామివారికి గరుడవాహనసేవను వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో ఉదయం అర్చకస్వాములు తిరుమంజనం, స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి,అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే రాత్రి అలంకృతులై అర్చకుల ప్రత్యేక పూజలందుకున్న శ్రీసీతా లక్ష్మణ సమేత కోదండరాముల సా వ్యముల వారు అలంకరించిన గరుడవాహనంపై అధిరోహించి పురవీధులఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి. ఉత్సవ ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుప్పంలో కడ ప్రత్యేక తనిఖీ బృందం ఏర్పాటు

కడ పి.డి .వికాస్ మర్మత్

కుప్పం మార్చి 31 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు కుప్పం ఏరియా అభివృద్ధి అథారిటీ (కడ) ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. మొత్తం ఏడు మందితో ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందంలో కడ తహసిల్దార్ ,కడ ఏపీఎం, పంచాయతీ రాజ్ శాఖ డి ఈ, కడ సీనియర్ అసిస్టెంట్, ఎస్టెు కడ డీఈవో ఉంటారన్నారు .ఈ బృందం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును పరిశీలిస్తాయి అన్నారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాలు తదితర ప్రభుత్వ సంస్థల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడడంతో పాటు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు, లబ్ధిదారులతో ఈ బృందం నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సైతం సేకరిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ బృందం ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొని అందుకు సంబంధించి తగు నివేదికలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ బృందం ద్వారా క్షేత్రస్థాయిలో నిజమైన పరిస్థితులను అంచనా వేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరిపాలనపరంగా పారదర్శకత ఉండేలా మరియు ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు .

రిజిస్ట్రార్‌పై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం...!

ఎస్వీయూ ఈసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

ఎస్వీయూ పరిపాలనా భవనంలో మంగళవారం పలు కీలక అంశాలపై వీసీ అధ్యక్షతన ఈసీ సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీ సాధారణ బడ్జెట్ ప్రధాన ఎజెండాగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆన్లైన్ విధానంలో సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ పలు అంశాలపై ఆరా తీశారని, రిజిస్ట్రార్ వద్ద సమగ్ర సమాచారం లేకపోవడంతో ఆయనపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో బుధవారం వర్సిటీలో జరగాల్సిన అకడమిక్ సెనేట్ సైతం వాయిదా పడింది. అలాగే వర్సిటీలో ఇప్పటికే సస్పెండ్ అయిన ముగ్గురు అధ్యాపకులపై వచ్చిన నివేధికల ప్రకారం తక్షణ చర్యలపై పెద్ద ఎత్తున చర్చజరిగింది. ఇందులో ఓ ప్రొఫెసర్కు ఈసీ సమావేశంలో క్లీన్చిట్ ఇచ్చినట్లు తెలిసింది. రూ.225 కోట్ల బడ్జెట్కు ఆమోదం లభించింది. అటానమస్ కళాశాలలకు అప్లియేషన్ ఫీజు రూ.59వేలుగా నిర్ణయించారు.

దళారుల వ్యవస్థను అరికట్టడానికి విజిలెన్స్

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల అక్రమాలను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలను ఇఒ బికె వెంక టేశులు తీసుకుంటున్నారు. గత 20 రోజులుగా ఆలయంలోని పరిస్థితి, ఇక్కడ జరుగుతున్న తతంగాలను జాగ్రత్తగా గమనించిన ఇఒ కొన్ని కఠినమైన నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జటిలంగా మారిన 'దళారి వ్యవస్థను కట్టడి' చేయటానికి కొన్ని విధాన నిర్ణయాలను తీసుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారి వ్యవస్థ కొందరు రాజకీయ నాయకుల సిఫార్సులతో ఇక్కడ కొలువు సాధిస్తున్న వారితో చోటు చేసుకుందనేది జగమెరిగిన సత్యం. ఇక్కడి రాజకీయ నాయకుల అనుచరులకు ఆలయం ఓ ఉపాధి కేంద్రంగా మారింది. కొందరు ఆలయంలో పిఆర్ఓలుగా మరి కొందరు సెక్యూరిటి ముసుగులో ఆలయంలో అవకాశం సాధిస్తూ అక్కడ నుంచి సంపాదనే ధ్యేయంగా మారుతున్నారు. అయితే ఈ వ్యవస్థను జాగ్రత్తగా అధ్యయనం చేసిన ఇఒ బికె వెంకటేశులు ఒక అడుగు ముందుకేసారు. దళారి వ్యవస్థను కట్టడి చేసి ఆలయం మీద వస్తున్న విమర్శలకు చెక్‌పెట్టడానికి చర్యలు తీసుకున్నారు. ఎనిమిది మందితో 'విజిలెన్స్ కమిటిని' ఏర్పాటు చేసారు. కమిటిలో ఎఇఒ పి.లోకేష్ బాబు, పర్యవేక్షకులు శ్రీహరి, శానిటరీ ఇన్స్పెక్టర్ బివి కృష్ణారెడ్డి, ఇఇఇ పి.శోభారాణి, సీనియర్ అసిస్టెంట్ టి.యోగేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ యం.మహేష్,ఎస్పిఎఫ్ నుంచి ఒకరు, హోంగార్డులనుంచి సూపర్‌వైజర్ వి.శ్రీనివాసతేజను నియమిస్తూ ఇఒ ఉత్తర్వులు జారి చేసారు.

శ్రీకోదండరామ స్వామికి స్నపన తిరుమంజనం

చంద్రగిరి, మార్చి 31 ప్రభాతవార్త:

శ్రీకోదండరామ స్వామి వారికి ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. టిటిడి అనుబంధ శ్రీకోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ అర్చకులు వేకువజామున శ్రీసీతా రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల సమేత హనుమంత స్వామి వారికి నిత్య కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో ఆలయ అర్చకులు శ్రీసీతాకోదండరామ లక్ష్మణ సమేత హనుమ ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణల నడుమ (అభిషేకం) స్నపన తిరుమంజన సేవ (పవిత్ర స్నానం) నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను శుద్ధిచేసి, ఆచారాల ప్రకారం నిర్వహించే ఈ ఉత్సవ స్నానం (సేవ) భక్తులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించగలదని విశ్వాసం. సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు శ్రీకోదండరామస్వామి వారి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ఆలయ కంకణభట్టార్ శ్రీనివాస భట్టార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, ఓఎస్ఓలు బెల్లంకొండ ప్రసాద్, రామకృష్ణ, పరిచారిక రామాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై బుల్లెట్ సురేష్ లైంగిక వేధింపులు

- టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీసీ నేత బుల్లెట్ సురేష్‌పై టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయ్యింది. చిత్తూరు నగరానికి చెందిన విన్నర్సీ అనే మహిళ తనపై బుల్లెట్ సురేష్‌తో పాటు అతని కుటుంబసభ్యులు ఆరు మంది తనను వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విన్నర్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2025 అక్టోబర్, నవంబర్ నెలల్లో తాను బాలాజీ నగర్ కాలనీలోని బుల్లెట్ సురేష్ రెండవ భార్య ఇల్లు, న్యూకైనికట్టు వీధిలో వున్న బుల్లెట్ సురేష్ కార్యాలయంలో పని చేస్తున్న సమయంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం రాత్రి విన్నర్సీ తండ్రి ఆరోగ్యదాస్ టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమార్తె బుల్లెట్ సురేష్ ఇంట్లో పనులు చేస్తున్న సమయంలో, కైనికట్టువీధిలోని కార్యాలయంలో పని చేసిన సమయంలో బుల్లెట్ సురేష్ తన కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించి లైంగిక కోరికలు తీర్చమని బలవంతం చేస్తూ పలుమార్లు లైంగికంగా వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భయం, ఆర్థిక ఇబ్బందుల కారణంతో ఈ వేధింపులు భరిస్తూ రావడం జరిగిందని, సెప్టెంబర్ 2025లో చేతి గడియారం దొంగతనం చేసిన ఘటన ఆధారంగా బుల్లెట్ సురేష్ సిసి ఫుటేజ్‌ను చూపించి విన్నర్సీని బెదిరించి లైంగిక ప్రయోజనాల కోసం ఒత్తిడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తానను నిరాకరిస్తే తప్పుడు కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు. అలాగే తన రెండవ భార్య ఇంట్లో విన్నర్సీ పై దాడి చేసి బలవంతంగా ఈడ్చుకెళ్ళినట్లు ఫిర్యాదు చేశారు. బుల్లెట్ సురేష్‌పై వచ్చిన ఫిర్యాదు ఆదారంగా విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని టుటౌన్ ఇన్స్ పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు.

మహిళ దారుణహత్య..?

గంగవరం,మార్చి 31, ప్రభాతవార్త :

పెద్దపంజాణిలో చీటీలు నిర్వహిస్తున్న ఓ మహిళ సోమవారం పెద్దపంజాణిలో అదృశ్యమై.. మంగళవారం రాత్రి పలమనేరు సమీపంలోని జగమర్ల అటవీ ప్రాంతంలో శవమై కనిపించడం పలు అనుమానాలకు దారితీస్తుంది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా..పెద్దపంజాణి మండలం చలమంగళం పంచాయతీ ఎగువ మిద్దెపల్లెకు చెందిన వెంకటరత్నం కుమార్తె చంద్రమ్మ(33)కు వికోట మండలం నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు చలపతి అనే యువకుడితో 15 ఏళ్ళ క్రితం వివాహం జరిగింది,వీరి దాంపత్య జీవితానికి గుర్తుగా ఒక కుమారుడు,ఒక కుమార్తె సంతానం.ఆరేళ్ళ క్రితం చంద్రమ్మ తన భర్తను వదిలి బిడ్డలను తీసుకుని పుట్టింటికి వచ్చేసింది.తరువాత కొంత కాలం గంగవరం మండలం నాలుగు రోడ్లలో గల ఓ ప్రైవేటు కంపెనీ నందు టైలరింగ్ వెళ్తూ..అనంతరం పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ఓ రూమును అద్దెకు తీసుకుని టైలరింగ్‌తో పాటు నెలవారి చీటీలు నడుపుకుంటూ జీవనం సాగించేది.ఈ నేపథ్యంలో సోమవారం చంద్రమ్మకు నిడిగుంట గ్రామంలో చీటి డబ్బులు రావాలని ఎగువ మిద్దెపల్లెకు చెందిన శంకరప్ప కుమారుడు సుబ్రమణ్యం అనే వ్యక్తితో ద్విచక్రవాహనంలో లింగాపురం వైపుగా వెళ్ళిన చంద్రమ్మ మంగళవారం రాత్రి పలమనేరు అడవీ ప్రాంతంతో శవమై తేలడంతో మహిళమృతిపై సర్వత్రాఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధి సీఎం చంద్రబాబుకే సాధ్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త

గ్రామాల అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, కడపిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొట్టాలూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కుప్పం నియోజకవర్గంలోని ప్రతి మారుమూల పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక గ్రామీణ ప్రాంతాలకు అవసరమైనచోట్ల తారు రోడ్లు, సిసి రోడ్లు ,డ్రైనేజీలు నిర్మించడం జరిగిందన్నారు. వీటితోపాటు దాదాపు ఎనిమిది వేల ఎల్ఈడి వీధి దీపాలను సైతం కడ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు .గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వం తరఫున పక్కా ఇల్లు, పెన్షన్లు,రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు ను మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మరమ్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పి కే యం యుడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కదా సభ్యుడు రామచంద్ర, సర్పంచ్ రాజేంద్రన్ మాజీ సర్పంచ్ సంజీవ రాజులు, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, శరవణ, ఐ టి డి పి అధ్యక్షుడు గుణశేఖర్, కార్తీక్ ,పొన్ను వేలు తదితరులు పాల్గొన్నారు.

పదవీవిరమణ ఉద్యోగికి సత్కారం

చిత్తూరురూరల్, మార్చి 31 ప్రభాతవార్త: జిల్లా గ్రంధాలయ సంస్థ నందు సుదీర్ఘకా లంగా పనిచేసి మంగళవారం పదవీవిరమణ చేసిన ఎం గజేంద్రబాబుకు గ్రంధాలయసంస్థ చైర్మెన్ శ్రీరెడ్డివారి గురవారెడ్డి జ్ఞాపికను అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరిం చారు. ఒక ప్రభుత్వఉద్యోగి 33ఏళ్ల పాటు నిరంతరాయంగా అంకితభావంతో పనిచే యడం అభినందనీయమని, తన శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలుకుతూ ఆయన అనుభవం సంస్థకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో గ్రంధాలయసంస్థ కార్యదర్శి ఆర్‌విఎస్‌ఎస్ శర్మ, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికే పౌర హక్కుల దినోత్సవం

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త

దళితుల సమస్యల పరి ష్కా రానికే పౌరహక్కుల దినోత్సవం ప్రతి నెలా నిర్వ హి స్తున్నట్లు తహసి ల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. మంగళవారం మండ లంలో ని కేడిపల్లి పంచా యతీ మఠార్లపల్లి దళిత వాడలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ దళి త వాడల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు .గ్రామాల్లో ఎక్కడైనా దళితుల పట్ల వివక్ష చూపితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు .సమావేశంలో ఆర్ఐ వేణుగోపాల్, సర్పంచ్ సరస్వతి, మాజీసర్పంచ్ మహేంద్ర,ఎమ్మార్పీఎస్‌మాజీజిల్లాఅధ్యక్షుడుప్రకాష్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సంజీవరాయ స్వామి దేవాలయంలో నవమి వేడుకలు

గంగాధర నెల్లూరు మార్చి 31 ప్రభాతవార్త:

శ్రీ రామనవమి వేడుకలలో భాగంగా కొండేపల్లె గ్రామంలో వెలసి వున్న శ్రీ సంజీవరాయ స్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలను జరుపుతున్నారు.ఈ సందర్భంగా ప్రతి రోజు మూల విరాట్ వీరాంజనేయ స్వామికి ఉత్సవ మూర్తులు శ్రీ సీతారామలక్ష్మణులకు ప్రతి నిత్యం అభిషేకాలు గోత్రనామ అర్చనలు ప్రత్యేక పుష్పాలతో అలంకరించి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నారు.మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం నంది అవార్డు గ్రహీత కళా రత్న బిరుదాంకితురాలు సప్ప భారతి గారిచే శ్రీమద్రామాయణ హరికథ కాలక్షేపం నిర్వహిస్తున్నారు.బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ సీతారముల వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్దలతో కార్తీక అయ్యంగార్ వేద మంత్రోచ్చారణ నడుమ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మండలి అధ్యక్షులు తాలూరు గోపాల్ నాయుడు తెలిపారు. నిర్వాహకులుగా కన్నయ్యనాయుడు రామ్మూర్తి నాయుడులతో పాటు పద్మాపురం కొండేపల్లి పోలినాయుడు పల్లి మారకనత్తం గ్రామస్తులు ఉభయ దారులుగా వ్యవహరిస్తున్నారు.

కుప్పం తాలూకా ఏపీ జెఏసి నూతన కార్యవర్గం ఎన్నిక

కుప్పం మార్చి 31 ప్రభాతవార్త

కుప్పం తాలూకా ఏపీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం కుప్పం ఎన్జీవో భవనంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ జెఏసి జిల్లా చైర్మన్ రాఘవులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా కుప్పం తాలూకా ఏపీ జేఏసీ చైర్మన్ గా సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గాలి సురేష్, వైస్ చైర్మన్లుగా సెల్వం ,రమేష్ కుమార్ రెడ్డి, జయపాల్, కార్యదర్శిగా ఫయాజ్ ,శివ, దినకర్, కోశాధికారిగా ఆనందప్ప, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు .ఈ సందర్భంగా ఏపీ జెఏసి జిల్లా అధ్యక్షుడు రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ ,కార్మికులకు సంబంధించి వేతన సవరణ కమిషన్ ను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు .అలాగే దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న డిఏ లను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, హిమబింధు దంతతులు నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబ సభ్యు లతో కలసి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ సూపరెండెంట్ వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సర్పంచులు మీ సేవలు అమూల్యం:: రామిరెడ్డి ద్వాజారెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 31 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండలంలో 21 పంచాయితీలలో పనిచేసిన సర్పంచులందరూ మీరు చేసిన సేవలకు అమూల్యంగా ఉన్నాయని, మీ సేవలకు ఎప్పుడు రుణపడి ఉంటామని రైల్వేకోడూరు వైసీపీ నేత మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాన్ని వైభవోపేతంగా వైసీపీ సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పాలక మండలి లో ఉన్న సర్పంచుల స్థితిగతులు అన్ని తెలిసినని అయితే ఏ పంచాయతీలో సమస్యలు ఉన్న తమ దృష్టికి తెస్తే ఇల్లు ఇల్లు తిరిగి అందరికీ న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పరిపాలన నుండి కూటమి పాలన వరకు పనిచేసిన నిజాయితీ సర్పంచులకు 21 మందికి కుటుంబ సభ్యులతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. అనంతరం ఎంపీడీవో జయశ్రీ, ఎమ్మార్వో అమర్నాథ్, ఆర్ ఐ లక్ష్మీదేవి తో పాటు పలువురు ముఖ్య నేతలైన కోడూరు ఉప సర్పంచ్ తోట శివ సాయి, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షఫీ తోపాటు సర్పంచులు ఆర్వి రమణ, నాయిని హరికృష్ణ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ శైలజ, బుడుగుంటపల్లి సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ఉప్పరపల్లి సర్పంచ్ ఆనాల చంగల్ రెడ్డి తదితరులు పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం కోడూరు జెడ్ పి టి సి పాలెం కోట రత్నమ్మ చంద్రాలను, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ద్వాజారెడ్డిని గజమాలలతో సన్మానించారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

రామకుప్పం, మార్చి31 ప్రభాతవార్త

గ్రామాలు దశదిశా అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ సులోచన గుర్రప్ప, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జయశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోవిందపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీకి నూతన మోటారు, పైపులు, వైర్లు అమర్చి త్రాగునీరు కాలనీకి అందించారు. గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న బావి బోరుకు మరమ్మతుల ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహకారంతో చెపట్టడం జరిగిందన్నారు. వేసవి కాల దృష్ట్యా ప్రజలకు త్రాగునీరు ఇబ్బందులు ఎదుర్కోకుండా సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్మూర్తి, కో క్లస్టర్ ఇంచార్జ్ శంకరాచలం, పార్టీ అధ్యక్షుడు మనేష్, నేతలు మహేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, రామలింగం ,షణ్ముగం, సుభాష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఐదు లక్షల చెక్కు పంపిణీ

శాంతిపురం, మార్చి 31 ప్రభాతవార్త

మండలంలోని కనుమల దొడ్డి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వెంకటేష్ ఇటీవల మృతి చెందారు. ఈయనకు పార్టీ తరపున బీమా సౌకర్యం ఉండడంతో ఐదు లక్షల రూపాయల చెక్కును మంత్రి నారా లోకేష్ భీమా కింద అందజేశారు .ఈ చెక్కును మంగళవారం వెంకటేష్ కుటుంబానికి ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ,ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అంద అందజేశారు. కార్యక్రమంలో నేతలు ఎల్ జయరామిరెడ్డి, రాజు ,శివ, కోదండప్ప తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల పరిరక్షణకోసం పౌరహక్కుల దినోత్సవం

వి.కోట, మార్చి 31 ప్రభాతవార్త:

దళితుల హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పౌరహక్కుల దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు. మండల పరిధిలోని బైసుకుప్పం గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నునిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం దళితుల ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజికపరంగా వారిని ఉన్నత స్థితికి చేర్చేందుకు చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.గ్రామంలోని దళిత కుటుంబాలకు మురుగునీటి కాలువలు నిర్మాణం విద్యుత్ స్తంభాలు ఏర్పాటుతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని అర్హులైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించారు.పెరిగిన జనాభాకు అనుగుణంగా దళితులకు స్మశాన వాటిక కోసం భూమిని కేటాయించాలని తహసీల్దార్ ను కోరగా వెంటనే స్థల పరిశీలన చేయాలని వీఆర్వోను ఆదేశించారు.గ్రామంలో దళితుల కోసం కమ్యూనిటీ భవనం నిర్మించాలని అధికారుల దృష్టికి దళిత నేతలు తీసుకొచ్చారు. దళితుల వ్యవసాయ భూములు, స్మశానవాటికలకు వెళ్లే దారులను అడ్డగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వేలో భాగంగా అర్హులైన దళిత కుటుంబాలకు ఏవైనా భూ సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.అదేవిధంగా దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ సాగుభూములకు భూ పంపిణీ కింద పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మోహన్ రెడ్డి,వీఆర్వో నారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నేతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా విద్యార్థినుల పార్లమెంటు నిర్వహణ

చిత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, విజయం ఇంజ నీరింగ్ కళాశాలలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, విద్యార్థి సంక్షేమ సాంస్కృతిక వ్యవహారాల డైరెక్టరేట్ ఆద్వర్యంలో నిర్వహించిన మహిళా విద్యార్థినుల పార్లమెంటు నిర్వహణ విజయవంతమైంది. ప్రొఫెసర్ బివి మురళీధర్ అధ్యక్షనత ప్రారంభమైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో మహిళలు కీలక పాత్రను, వివిధ రంగాలలో వారి సహకారాన్ని అందిస్తున్నారన్నారు. అలాగే విజయం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రాజగోపాల్‌నాయుడు మాట్లాడుతూ మహిళా విద్యార్థినులు వ్యవస్థాపకత, వృత్తులు, నాయకత్వస్థానాల వంటి విభిన్న పాత్రలను చేపట్టి సమాజానికి సహకరించాలని కోరారు. అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి, సామాజిక సమస్యలపై అర్థవంతమైన చర్యలలో పాల్గొనడానికి ఒక వేదికను అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి పాల్గొని తమ ప్రతిభను చాటిన ఎమరాల్డ్ డిగ్రీ కళాశాల, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, శ్రీపద్మావతి మహిళా కళాశాలకు వరుసగా మొదటి, రెండవ బహుమతి, మూడవ బహుమతిలను అందజేసారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

కుప్పం మార్చి 31 ప్రభాతవార్త.

మండలంలోని కొట్టాలూరు పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ప్రభుత్వ విప్, కడపిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మరమ్మత్ ,ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికలు, గర్భిణీ మహిళలకు, బాలింతలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, సర్పంచ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎంసీ చైర్మన్ జిఎం రాజు

శాంతిపురం మార్చి 31 ప్రభాతవార్త.

రైతులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసి చైర్మన్ జి ఎం రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అబకలదొడ్డి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై అందిస్తున్న మామిడి సాగు చేస్తున్న రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న కవర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పంట మంచి దిగుబడి సాధించేందుకు పంటను కాపాడేందుకు కవర్లను రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు .ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడి పల్లవి, ఉద్యానవన అధికారి వింధ్య, యూనిట్ ఇన్చార్జ్ మణి,సర్పంచ్ జనార్దన్ రెడ్డి, కడ సభ్యురాలు సుగుణమ్మ,మాజీ ఎంపీటీసీ వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమం

బైరెడ్డిపల్లి, మార్చి 31 ప్రభాతవార్త

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణాకార్యక్రమం మంగళవారం జరిగినది. మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శులు ,డిజిట ల్ అసిస్టెంట్స్ కు ఈశిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ విజయ, మోహన్ రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలలో అవసరాలను వాటి ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి నిధులను సమీకరించుకొని రానున్న ఆర్థిక సంవత్సరములో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో మన గ్రామ పంచాయతీలను తీసుకెళ్ళడానికి అవసరమగు ప్రణాళికలను తయారు చేసుకువాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి, ఎం ఈ ఓ సుబ్రమణ్యం, ఏ పీ ఓ హరినాథ్, ఏ పి ఎం లలిత, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ సురేష్ బాబు తదితర పంచాయితీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు, పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం

రామకుప్పం,మార్చి31 ప్రభాతవార్త

మండల శివారులోని పెద్ద చెరువు వద్ద అభివృద్ధి పనులకు టిడిపి నేతలు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం చెరువు ఆయకట్టును సర్వే చేశారు. ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్, పార్కు, ఐలాం డ్, విద్యుత్ అలంకరణ, తదితర అభివృద్ధి పనులకు 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయిందన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజు నాయక్,క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, కూటమి నేతలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గిరిజా కళ్యాణం

రామకుప్పం, మార్చి 31 ప్రభాతవార్త

మండల కేంద్రంలో వెలసి ఉన్న అన్నపూర్ణానంద సమేత కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం నేత్రపర్వంగా గిరిజా కళ్యాణం నిర్వ హించారు. మంగళవారం ఉదయం రుద్రా భిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. వేద పండితులు కృష్ణమూర్తి, నాగరాజు శర్మ స్వామి వారి ఉత్సవ మూర్తులను ఉత్సవంపై అధిరోహించి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాల వీధుల్లో విహరింపజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పార్వతీ, పరమేశ్వరులను పెళ్లి పీటలపై అధిరోహించి వేదమంత్రాలు ,మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవం జరిపించారు. అనంతరం భక్తులకు పెళ్లి వంటలు, చందన తాంబూలం అందజేశారు.ఉభయదారు లు గా జ్యోతి నగర వైశ్య సంఘం వారు వ్యవహరించారు.

రైతులకు మామిడి కవర్లు పంపిణీ

రామకుప్పం ,మార్చి 31ప్రభాతవార్త

మండలంలోని మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం ముందస్తుగా మామిడి కవర్లను అందిస్తోందని మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ,ఆనంద రెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం బందార్లపల్లి సేవా కేంద్రంలో ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీతో మామిడి రైతులకు కవర్లను పంపిణీ చేశారు. మామిడి కాయలకు ఊజి నియంత్రణకు సమగ్రంగా నివారించేందుకు కవర్లు ఎంత ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామరాజు నాయక్, మాజీ సర్పంచ్ సీతాపతి, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ ముని రెడ్డి, శ్రీరాముల రెడ్డి, హరి నాగరాజు, మోహన్ బాబు ,గణేష్, ఉద్యాన శాఖ అధికారి డింపు ప్రియా, మనోజ్ కుమార్, మోనిక ,వినయ్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను కాపాడండి

పుల్లంపేట, మార్చి 31 ప్రభాతవార్త :



పుల్లంపేట మండలంలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని పుల్లంపేట మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొమ్మన వారి పల్లి నుంచి తిప్పాయపల్లి వరకు అనేకమంది ప్రభుత్వ భూములను ఆక్రమించి చదును చేసి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను కూడా అక్రమంగా ఏర్పాటు చేశారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతసముద్రం గ్రామంలో కేవలం మూడు సెంట్లకు ఉన్న భూమికి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశారని ఇలా ఎంతోమంది తప్పుడు పత్రాలతో విద్యుత్ కనెక్షన్లు పొందారని అన్నారు. మండలంలోని దేవసముద్రం చెరువు నుండి రాత్రి పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా మట్టిని తోలుతున్నారని ఈ విషయం తెలిసి కూడా ఇరిగేషన్ అధికారులు తెలియనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. మండలానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన విధులకు దుమ్మా కొట్టి మండలంలోని అన్ని చెరువుల నుండి మట్టి వ్యాపారం చేస్తున్నారని అన్నారు. అనుమతులు రాకముందే మండలంలోని అనేక పంట కాలువలను పనులు చేపట్టారని దీంతో ఉడుమారపల్లె గ్రామానికి చెందిన సుమారు 45 ఎకరాలలో అరటి చెట్లు పనికిరాకుండా పోయాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన అన్నార. దేవసముద్రం పెద్ద చెరువు చిన్న చెరువు భూములను 7 ఎకరాలు పాటు ఆక్రమించిన ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోలేదని చెరువు భూములపై విచారణ చేపట్టాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ వైయస్ ఎంపీపీ ఎం జయశంకర్ భోగా వెంకటరత్నమ్మ వైద్యాధికారి శేఖర్ పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ముస్తాక్ సర్పంచ్ మణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

పేదల సొంతింటి కల నిజం చేసిన సిఎం చంద్రబాబు

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి

శాంతిపురం, మార్చి 31 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సొంతింటి కల నెరవేర్చారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు .టిడ్కో గృహ సముదాయాలను విశాలమైన రహదారులు, మెరుగైన సౌకర్యాలతో లబ్ధిదారులు వంటి సౌకర్యాలు కల్పనకు పెద్దపీట వేశారన్నారు. టౌన్ షిప్ మాదిరిగా టిడ్కో గృహ సముదాయలను అభివృద్ధి చేశారన్నారు. 2019 నాటికే టిడ్కో ఇళ్లన్నీ 90 శాతం పనుల పూర్తయ్యాయని, తరవాత వచ్చిన ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయడంలో విఫమయ్యారని మండిపడ్డారు. చివరికి కడపలో టిడ్కో ఇళ్లను సైతం పూర్తి చేయలేకపోయారని విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతోనే పేదలకు టిడ్కో ఇళ్లు అప్పగించే పని చేపట్టామన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆయన స్ఫూర్తిగా పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు 201419 మధ్య కాలంలో, ఎన్టీఆర్ ఇళ్లు, టిడ్కో ఇళ్లను నిర్మించి పేదలకు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నారన్నారు. టిడ్కో గృహ సముదాయాలను 2019 ఎన్నికల తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ టిడ్కో గృహ సముదాయాలను గాలికొలిలేశారని విరుచుకుపడ్డారు. కమిషన్ల కోసం టిడ్కో ఇళ్లకు రంగులు వేసి జేబులు నింపుకున్నారని విమర్శించారు. టిడ్కో గృహ సముదాయాల పేరుతో బ్యాంకుల తెచ్చిన రుణాలు దారి మళ్లించారు. దీంతో ఈ భారం లబ్ధిదారులపై పడిందన్నారు. అటు ఇళ్లు రాక ఇటు బ్యాంకుల నుంచి వాయిదాలు చెల్లించాలని ఒత్తిళ్లు రావడంతో లబ్ధిదారులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. గృహ సముదాయాల్లో పనులు పూర్తి చేసి, సకల సౌకర్యాలతో లబ్ధిదారులకు ఆనాడు టిడ్కో ఇళ్లు ప్రారంభించింది సీఎం చంద్రబాబు అని, ఈ ఏడాది చివరికి మరో 4.5 లక్షల ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 21 నెలలోనే ఇప్పటివరకు 5.5 లక్షల ఇళ్లను నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు.

యోగా థెరపీ ఇంటర్న్‌షిప్ విజయవంతం

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో ఎంఎస్సీ యోగా థెరపీ విద్యార్థుల కోసం నిర్వహించిన రెండు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ,మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షి త్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజ ేశారు. యోగా విజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ తపన్ కుమార్ ఘడే ఆధ్వర్యంలో ఈ ఇంటర్న్‌షిప్ నిర్వహించగా, డాక్టర్ ఆర్. లక్ష్మీ ్మ నారాయణ, డాక్టర్ లోకేశ్వర్ కె.సి.ఎస్ సహా పలువురు అధ్యాపకులు సహకారం అందించారు. డాక్టర్ ఈ.పీ. నాగలక్ష్మి ్మ, డాక్టర్ వి. గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఎం. అజయ్ కుమార్, డాక్టర్ డి. సరిత, ఎన్. మోనికల సేవలు కార్యక్రమం విజయవంతానికి తోడ్పడ్డాయి. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె. వెంకట నారాయణ రావు, అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రాజ్నికాంత్ శుక్లా, దర్శనం స్కూల్ డీన్ ప్రొఫెసర్ వి.ఎస్. విష్ణుభట్టాచార్యుల ప్రోత్సాహం, మార్గదర్శకత్వం కార్యక్రమం విజయవంతానికి కారణమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు యోగా థెరపీపై ప్రాయోగిక అనుభవాన్ని పొందడంతో పాటు క్లినికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. శ్రీనివాస్ కుమార్, స్వస్థవృత్త విభాగాధిపతి డాక్టర్ లావణ్య, యోగా ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ నరసా రెడ్డి, యోగా విజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ తపన్ కుమార్ ఘడే, నేషనల్ సంస్కృత యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి. శివకుమార్, డాక్టర్ రాహుల్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని సన్నిధిలో పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త: రాష్ట్ర స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయనకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపరెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.70 వేలు జరిమానా

చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 7 మందిని గుర్తించి వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిస్తే మేజిస్ట్రేట్ మంగళవారం ఒకొక్క వ్యక్తి 10 వేల రూపాయలు చొప్పున 7 మందికి 70 వేల రూపాయలు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు వెల్లడించిన వివరాల మేరకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 7 మంది ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ పరిమిళా దేవి ఎదుట హాజరు పరిచారు. ఈ మేరకు జడ్జి పరిమిళాదేవి ఒకొక్క వాహనదారుడికి 10 వేల రూపాయలు చొప్పున 7 మందికి 70 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.1.13 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, మార్చి 31 ప్రభాతవార్త:

గుడిపాల మండలంను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామభద్రాపురం గ్రామ పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు 1.13 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజలు చిరకాలంగా రామభద్రాపురం నుండి దాయంవారిపల్లికు వెళ్ళడానికి సిమెంటు రోడ్డు కోసం ఎదురు చూశారన్నారు. వారి ఆశలను ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అలాగే ఎమ్మెల్యే గురజాల ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్, ఆరోగ్య ఉప కేంద్రం, రామభద్రాపురం రామాలయం వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు, రామభద్రాపురం గ్రామ పంచాయతీ భవనంను ఎమ్మెల్యే ప్రారంభించారు. రామభద్రాపురం వచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడులు పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, ఎంపిడిఓ శిరీష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, మాజీ జడ్పీటీసీ సుమతి మురళీ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్, పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్

బంగారుపాళ్యం, మార్చి 31 ప్రభాతవార్త:

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. అయితే సమావేశం మాత్రం తూతూ మంత్రంగా చేపట్టారు. ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం జరిగే సమావేశంలో ప్రజా సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారాలను కోరేవారు. అయితే మంగళవారం జరిగిన మండల సమావేశంలో అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు తప్పా సభ్యులు ఎవ్వరు ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాలేదు. కేవలం అధికారుల సమగ్ర నివేదికలు వివరించడానికే ఈ సమావేశం పరిపోయింది. కొంతమంది సభ్యులు మాత్రమే చిన్నపాటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిధిలో యూరియా కొరత ఎక్కువగా వుందని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. అవసరంకు తగ్గ యూరియాను ప్రభుత్వం పంపిణీ చేయడంలో విఫలం అయ్యిందని సభ్యులు ఆరోపించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎంపిడిఓ మహేష్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ధనశేఖర్‌కు పీ4 అవార్డు

బంగారుపాళ్యం, మార్చి 31 ప్రభాతవార్త:



స్థానిక రోప్ సంస్థ డైరెక్టర్ ధనశేఖర్‌కు రాష్ట్ర స్థాయిలో పి4 అవార్డు లభించింది. సోమవారం తిరుపతి నగరంలో పి4 వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును తీసుకున్నారు. పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి రోప్ సంస్థ తరపున పలు సేవా కార్యక్రమాలను ధనశేఖర్ చేపట్టారు. ఆర్థికంగా వృద్ధి చెందడం, విద్య, వైద్యం, దివ్యాంగులకు సహాయం, తదితర అంశాల్లో రోప్ సంస్థ తగు సహాయం పేదలకు అందించింది. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం పి4 రాష్ట్ర స్థాయి అవార్డును ధనశేఖర్‌కు అందించింది. ఈ సందర్భంగా ధనశేఖర్ మాట్లాడుతూ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

భూకబ్జా ప్రయత్నంపై కేసు నమోదు

- పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

పాకాల, మార్చి 31, ప్రభాతవార్త

పాకాల మండలం గుంత గాదంకి గ్రామంలో భూకబ్జా ప్రయత్నం జరిగిన ఘటనపై పాకాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సిఐ టీ చిన్న గోవిందు తెలిపిన వివరాల మేరకు.. గుంత గాదంకి గ్రామానికి చెందిన శేషాచలం సులోచనమ్మ (55) ఫిర్యాదు మేరకు, ప్రభుత్వం సుమారు 40 సంవత్సరాల క్రితం కేటాయించిన డిపట్టా భూమిలో అక్రమంగా ప్రవేశించి కబ్జా చేయడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఆమె సుమారు 1 ఎకరం 43 సెంట్ల భూమిని ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ మామిడి తోటను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన పాస్‌బుక్, 1బి సహా అన్ని రెవెన్యూ పత్రాలు ఆమె పేరుమీదనే ఉన్నాయని వెల్లడించారు. పోలీసుల సమాచారం ప్రకారం, అదే గ్రామానికి చెందిన వెంకట ముని తన అనుచరులతో కలిసి మార్చి 26న బాధితురాలి భూమిలో అక్రమంగా ప్రవేశించి గుడిసె నిర్మించి భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా బాధితురాలిని మామిడి తోటలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు కులం పేరుతో బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పాకాల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 51/2026గా కేసు నమోదు చేసి, సంబంధిత చట్టాల ప్రకారం దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును ఎస్ఐ జ్యోతిరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

కార్యదర్శులు డిప్యూటేషన్‌పై సభ్యులు ఆగ్రహం

- పంచాయతీ పాలన

వడమాలపేట, మార్చి 31 ప్రభాతవార్త: కార్యదర్శులు డిప్యూటేషన్ పై వేరే మండ లాలకు వేయడంతో పంచాయతీ పాలన కుంటుపడుతున్న దనిసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం వడమా లపేట మండల సర్వసభ్య సమా వేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళ వారం జరిగింది. మండలంలో వందశాతం ఇంటి పన్నులు వసూళ్లచేసిన ఏడు మంది పంచాయతీ కార్యదర్శులను తిరుపతి పరిసర ప్రాంతాల్లో డిప్యూటేషన్ మీద పంపడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోందని జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాల్సిన కార్యదర్శులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్వాక్రా మహిళాసంఘాల రుణాల మంజూరులో వీవోలు లంచాలకు పాల్పడుతున్నారని ఎస్‌బీఆర్ పురం సర్పంచ్ మణిరాజు ఆరోపించారు. సమావేశంలో మణిరాజు మాట్లాడుతూ ఎస్‌బీఆర్ పురం పంచాయతీలో డ్వాక్రా సంఘ సభ్యులు రుణం బ్యాంకు ద్వారా తీసుకుంటే వీవోలు లంచం అడిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాల్సిన వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి వాత్తసు పలుకుతున్నారని ఆరోపించారు. ఎస్‌బీఆర్ పురం వీవోపై ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని కోరారు. వడమాలలో తాగునీటి పైపులైన్ మరమ్మతుకు గురైందని సింగిల్‌విండో అధ్యక్షుడుకుమార్ తెలిపారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ మండల గ్రాంట్‌లో రెండు లక్షల రూపాయల మేరకు వచ్చిన ప్రతిపాదనల మేరకు మంజూరు చేశామన్నారు. సమావేశంలో ఏవో హరినాథ్ బాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ఘనంగా సన్మానం

వడమాలపేట, మార్చి 31 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లను అధికా రులు, అధికార పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏప్రిల్ 2వ తేదీసర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు మణిరాజు, వెంకటేష్, మునెమ్మ, అంజెమ్మ, రాజేశ్వరి, మస్తానమ్మ, ధర్మయాదవ్‌లను ఎంపీడీవో శేషగిరిరావు, ఏవో హరినాథ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో బాలాజీ, కార్యదర్శులు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మిలు శాలువలు, పూలమాలతో సన్మానించారు. అనంతరంటీడీపీ నాయకులుధనంజయలునాయుడు, దాముయాదవ్ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు.

గుండెపోటుతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

వడమాలపేట, మార్చి 31 ప్రభాతవార్త: వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ శివ(39) గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం విధి నిర్వహణలో అస్వస్థతకు గురయ్యారు. కూలీలు అప్రమత్తమై గ్రామస్తులకు సమాచారం అందించారు. శివను తిరుపతి ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉపాధి ఏపీవో హంసవేణి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జి పాలెంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం

రేణిగుంట, మార్చి 31 ప్రభాతవార్త



రేగుంట మండలం జి పాలెం పంచాయితీలో కొలువు దూలిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ మందిరంలో శ్రీరామ జయంతి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంబేద్కర్ స్టార్ కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. పురోహితులు శ్రీనివాస శర్మ వేదమంత్రాలు వల్లిస్తూ ఆదర్శ దంపతులు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. భక్తులకు ఆదర్శ దంపతులైన శ్రీసీతారాముల కళ్యాణ అక్షితలు పంపిణీ చేశారు. గ్రామస్తులతో పాటు మండల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్టార్ కృష్ణ దంపతులు శ్రీ సీతారాములను వేడుకున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి వడపప్పు పానక ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ తరగతులు1నుంచిప్రారంభంకానున్నాయని ఆర్ఎఓ జి రాజశేఖరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీబీఎస్ఈ విధానం అమలులో భాగంగా ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30లవరకు తరగతులు కొనసా గుతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 24 నుంచి మే 31వ తేదీవరకు వేసవి సెలవులు పేర్కొన్నారు. జూన్ ఒకటో తేదీన తిరిగి కాళాశాలలు పున:ప్రారంభమవుతాయని తెలియజేశారు.

ఏపీఆర్ జేసీ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఏపీఆర్ జేసీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును మరోసారి పొడిగించారు. అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో ముగియాల్సిన దరఖాస్తుల గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. దీంతో అభ్యర్థులకు మరింత అవకాశం లభించనుంది.

16 నుంచి ఎల్ఎల్ఎమ్ పరీక్షలు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

ఎస్వీయూ పరిధిలోని న్యాయ కళాశాలల్లో ఎల్ఎల్ఎమ్ మొదటి మరియు మూడవ సెమిస్టర్ పరీక్షలను వచ్చేనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజామాణిక్యం తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు పరీక్ష ఫీజును వచ్చేనెల 4వ తేదీలోపు చెల్లించాల్సి ఉండగా, 13వ తేదీన హాల్ టికెట్లను అందజేస్తామని వెల్లడించారు.

రూసా ఫెల్లోషిప్‌ను ఐదేళ్లపాటు అమలు చేయాలి

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

ఎస్వీయూలో పీహెచ్‌డీ చేస్తున్న పరిశోధక విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పరిశోధక విద్యార్థులతో కలిసి వారు రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, వర్సిటీలో ఫెలోషిప్ లేని పరిశోధకులకు అందిస్తున్న యూనివర్సిటీ రీసెర్చ్ ఫెలోషిప్‌ను రూ.15 వేల వరకు పెంచి ఐదేళ్లపాటు కొనసాగించాలని కోరారు. అలాగే అన్ని విభాగాల్లో ల్యాబ్ సదుపాయాలు, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిశోధకులు హారిక, రతన్సి, వీరాంజనేయులు, కృష్ణ, దాస్, పూజిత, పావని, సుధా, వనజ, సుకూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 63 మంది విద్యార్థులు గైర్హాజరు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా నందు నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు–2026లో భాగంగా సంస్కృతం (45 అండ్ ఓ ఎస్ ఎస్ సి) పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 8779 మంది విద్యార్థులకు గాను 8711 మంది హాజరుకాగా, 63 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి కె వి యెన్ కుమార్ 2 పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కూడా 2 కేంద్రాలను తనిఖీ చేశారు. అదేవిధంగా, ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు చెందిన 9 మంది సభ్యులు 27 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 102 పరీక్షా కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.

తిరుపతి డివిజన్

వేసవి సెలవులు మంజూరు చేయండి

సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన

సత్యవేడు, మార్చి 31 ప్రభాతవార్త:

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ పిలుపులో భాగంగా సత్యవేడు ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ శాంతి మాట్లాడుతూ మే నెలలో ఎండలు తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ప్రీ స్కూలు పిల్లలు వడదెబ్బకు గురై అనారోగ్యం పాలవుతుండడంతో తల్లిదండ్రులు పంపడానికి సుముఖిత చూపడం లేదన్నారు. బాలింతలు కూడాసెంటర్‌కు రాలేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్లు మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లేటప్పుడు ఎండ తీవ్రతను తట్టుకోలేక అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. ఎండల్లో చిన్నారులు రాకపోయినప్పటికీ హాజరు శాతం పెంచాలని ఉన్నత అధికారులు ఒత్తిళ్లు తేవడం పట్ల ఆవేదన వ్యక్తపరచారు. కావున పిల్లలకు గర్భిణీ, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ ఇచ్చి అంగన్‌వాడీలకు మే నెనల అంతాసెలవులు ఇచ్చేలా ప్రభుత్వం అధికారిక జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు అరుణాచలం, సత్యవేడు అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి నిర్మల, కార్యకర్తలు ఇంద్ర, దివ్య, గౌరి, నందిని, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25న పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష

సత్యవేడు, మార్చి 31 ప్రభాతవార్త: పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 25వ తేదీ జరుగుతుందని సత్యవేడు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. జిల్లాలో గూడూరు, నాయుడుపేట, సత్యవేడు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి తదితరకేంద్రాల్లో పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షలు ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఇది వరకే పదో తరగతి ఉత్తీర్ణులు అయిన వారు ప్రస్తుతం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న వారు కూడా పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షలు కోసం రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధిం ఎస్సీ, ఎస్టీలు 100 రూపాయలు, బీసీ, ఓసీలు 400 రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు.పీవోఎల్‌సీ ఈటీఏపీ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందు కోసం కళాశాలలో హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా రిజిస్టర్ చేసుకోవచ్చున్నారు. పైగా కళాశాలలో ఏప్రిల్ 23 వరకు ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వివరాల కోసం ఆనందరావు 8985775216, ప్రభాకర్ 9492402543 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఘనంగా డిప్యూటీ ఎంపీడీవో పదవీ విరమణ కార్యక్రమం

నాగలాపురం, మార్చి 31 ప్రభాతవార్త:

నాగలాపురం మేజర్ పం చాయతీ సర్పంచ్ సుధా చిన్నదొరై ఆధ్వర్యంలో ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా తహసీల్దార్ హనుమాన్ నాయక్ పాల్గొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో రమేష్ చంద్ర మంగళవారం పదవీ విరమణ పొందారు. వారికి ఎంపీడీవో శ్రీ తేజస్విని ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అంకితభావంతో పనిచేస్తూ పలువురు మెప్పు పొందారని అన్నారు. 38 సంవత్సరాలుగా పలు పంచాయతీల్లో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఆయనకు మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, కార్యాలయ సిబ్బంది ఘనంగా శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధిక, వీఆర్‌వో నాగభూషణం, మహేష్, కార్యాలయ సిబ్బంది ప్రభాకర్ పాల్గొన్నారు.

నాగలాపురంలో 5,221 మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

నాగలాపురం, మార్చి 31 ప్రభాతవార్త:

ఏప్రిల్ 1 బుధవారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయను న్నట్లు ఎంపీడీవో శ్రీ తేజస్విని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 సచివాలయాల పరిధిలో మొత్తం 5221 మందిలబ్ధిదారులకు గాను రూ.2,21,70,500లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులందరికి బుధవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బందిద్వారాఇంటివద్దకేపింఛన్‌సొమ్మును అందజేస్తామన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ సొమ్మును తీసుకోవాలని ఆమె కోరారు.

బ్రహ్మర్షి ఆశ్రమంలో తెలంగాణ గవర్నర్

రామచంద్రాపురం, మార్చి 31 ప్రభాతవార్త:

సి.రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మర్షి గురువానంద గురూజీ ఆశ్రమాన్ని మంగళవార ం తెలంగాణ గవర్నర్ శివప్రసాద్ శుక్లా దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు ఆశ్రమ నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో వెలసియున్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారిని గవర్నర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కుటీరానికి చేరుకుని గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

జంతు పరిశోధనలపై సాంకేతికత అవసరం

ప్రొఫెసర్ డి.సుజాత

రామచంద్రాపురం, మార్చి 31 ప్రభాతవార్త: జంతు పరిశోధనలపై ఆధునిక సాంకేతికత అవసరమని శ్రీ పద్మా వతి మహిళా విశ్వ విద్యాలయం ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రొఫెసర్ డి.సుజాత అన్నారు. మంగళవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఫార్మకాలజీ ఆధ్వర్యంలో జంతుప్ర యోగాలు, నియంత్రణ, పర్యవేక్షణ అనే అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతు ప్రయోగాలలో రిఫైన్‌మెంట్ ప్రాముఖ్యత బయో మెడికల్ పరిశోధనలు, నైపుణ్యాలు జంతు సంరక్షణపై అవగాహన కలిగివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నైకి చెందిన కెకె ఫార్మశీ కళాశాల ప్రొఫెసర్ ప్రేమ్‌కుమార్, చేబ్రోలు హనుమయ్య ఫార్మా స్యూటికల్ కళాశాల ప్రొఫెసర్ సందీప్, ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆర్‌వి సురేష్‌కుమార్, సెవెన్‌హిల్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, ఫార్మా విభాగాధిపతి జ్యోతి బసిని, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మల్లికార్జున్ రెడ్డి ఆదర్శం

రేణిగుంట, మార్చి 31 ప్రభాతవార్త

గత దశాబ్దాల కాలంగా రేణిగుంట పట్టణంలో కొలువుతీరిన శ్రీ గంగమ్మ తల్లి జాతరను నిర్విఘ్నంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతిఏటా క్రమం తప్పకుండా జరుపుతున్న ఘనత ఆలయ శాశ్వత ధర్మకర్త ప్రస్తుత గుడి చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డికి దక్కుతుందని టిడిపి సీనియర్ నాయకులు, మైనార్టీ నేత మునీర్ జీకే వ్యాఖ్యానించారు. రేణిగుంట శ్రీ గంగమ్మ దేవస్థానం ప్రాంగణంలో సోలా మల్లికార్జున్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం దాదాపు 2000 మందికి అన్నసంతర్పణ సహపంక్తి ద్వారా వడ్డించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మల్లికార్జున్ రెడ్డిని ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నేత వన్నెకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్ప నాదం. టిడిపి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అఫ్రోజ్, టిడిపి సీనియర్ నాయకులు నవాబు, రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. ఆర్. రావణన్, టిడిపి నాయకులు మాజీ సర్పంచి జ్యోతి నారాయణ, జూలియన్ రాజు, సదాశివరెడ్డి, టిడిపి నేత కన్నన్ రెడ్డి, లక్ష్మణ్ పెద్ద సంఖ్యలో సోలా మల్లికార్జున్ రెడ్డి అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు

సూళ్ళూరుపేట డివిజన్

బంగారు కుటుంబంలో సేవలు అందించిన నవజీవన్

వెంకటగిరి, మార్చి 31 ప్రభాతవార్త: బంగారు కుటుంబం కార్యక్రమంలో సేవలందించిన నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కె.సహదేవయ్యను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అభినందించారు. బంగారు కుటుంబం పి-ఫోర్ కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సహ దేవయ్య, సిబ్బంది విరివిగా సేవలందించారు. బంగారు కుటుంబం దత్తత తీసుకొని వారి జీవితాల్లో వెలుగు నింపారు. ఆర్థికంగా వారిని బలోపేతం చేసేందుకు నవజీవన్ స్వచ్ఛంద సంస్థ విశేష కృషి చేసింది. ఇందుకుగాను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సంస్థను అభినందించారు.

నిధులు మంజూరుపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

వాకాడు, మార్చి 31 ప్రభాతవార్త: మండలంలోని నీటి కొరత సమసపై జలజీవన్ మిషన్ పథకం కింద మండలంనకు కోటి యాభై లక్షలు రూపాయలు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ మంజూరు చేసినందుకు వాకాడు మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధు రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో మండలంలోని తిరుమూరు గ్రామ పంచాయతీకి 45.25 లక్షలు, వల్ల మేడు గ్రామానికి 15.86లక్షలు, నిడిగుర్తి గ్రామానికి 9.75 లక్షలు, గొల్లపాలెం గ్రామానికి 29.28 లక్షలు, పూడి రాయి దొరువు గ్రామానికి 12.40 లక్షలు నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యేకు మండల టిడిపి కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

వాగర్రులో సివిల్ రైట్స్ డే

వాకాడు, మార్చి 31 ప్రభాతవార్త: మండలం జమీన్ కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని వాగర్రు గ్రామంలోని మంగళవారం డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పొలాలు ప్రతి ఒక్కరికి అందాలని, పౌర హక్కుల దినోత్సవంలో ఆయన అన్నారు. లీగల్‌గా ప్రతి సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు, గ్రామంలోని త్రాగునీటి సమస్య ప్రభుత్వం అందిస్తున్న అనేక కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి అందేలా హక్కును స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, వీఆర్వో శ్రీనివాసులు, అంగన్వాడి సూపర్వైజర్ బుజ్జమ్మ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం

సూళ్లూరుపేట, మార్చి 31 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సమీపంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుధాకర్ (45) అనే ఆటోడ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. సూళ్లూరుపేట నుంచి ముగ్గురు ప్రయాణి కులతో దొరవారిసత్రం మండలం గొల్ల పాలెం గ్రామానికి వెళుతున్న ఆటోను చెన్నై వైపు నుంచి నెల్లూరుకు వెళుతున్న కారు వెనుకవైపు నుంచి ఢీకొంది. మద్యం మత్తులో ఉన్న కారుడ్రైవర్ ఈ దుర్ఘటనకు పాల్పడినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో బోల్తాపడి అందులోని ప్రయాణికులతో పాటు ఆటో నడుపుతున్న డ్రైవర్ సుధాకర్ రోడ్డుపక్కన డివైడర్ పక్కగా పడిపోయాడు. ఈ నేపథ్యంలో అదేవైపు వస్తున్న లారీ సుధాకర్‌పై దూసుకుపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సుజాత, శృతి, మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో శృతి పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం చెన్నైకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు దేవాలయం... రైతు సేవా సహకార సంఘం

సూళ్లూరుపేట, మార్చి 31 ప్రభాతవార్త: రైతు సేవాసహకార సంఘం రైతులకు దేవాలయం లాంటి దని సూళ్లూరుపేట రైతు సేవాసహకార సంఘం అధ్యక్షులు ఎజి కిషోర్ అన్నారు. మంగళవారం సహకార సంఘంలో నిర్వహించిన మహాజన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూళ్లూరుపేట రైతు సేవా సంఘం పరిధిలోని రైతులకు సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని, ఎవరో రాజకీయ కక్ష్యలతో వ్యక్తిగతంలో తనను టార్గెట్ చేసి సహకార సంఘాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నిస్తుండటం దురదృష్టకరమన్నారు. తనపై వ్యక్తిగతంగా కక్ష్యలు ఉంటే సహకార సంఘంతో పనిలేకుండా వెలుపలే తనపై కక్ష్య తీర్చుకోవచ్చని, ఇందుకు తాను కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఎసిఎస్ మాజీ ఛైర్మన్ తిరుమూరు పట్టాభిరెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, చిట్టేటి పెరుమాళ్ళు, దువ్వూరు మురళీరెడ్డి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలను బాగు చేయించండి

వెంకటగిరి, మార్చి 27 ప్రభాతవార్త: పట్టణంలో ఉన్న స్మశానాలు దుస్థితిలో ఉన్నాయని వాటిని బాగు చేయించాలని వైసిపి ఆర్టిఐ నియోజకవర్గం విభాగ అధ్యక్షులు ఆరి శంకరయ్య కమిషనర్ ఈగ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. స్మశా నాలకు ప్రహరీ లేకపోవడంతో వీటిని కొందరు ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. స్మశానం ముళ్ళ చెట్లు మొలిచి ఉన్నదని, శవాలను తీసుకెళ్లేందుకు కూడా కష్టంగా ఉందని 14 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. స్మశానంలో శవాల దహనానికి కనీస వసతులు కూడా లేవని తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో కోచింగ్

వెంకటగిరి, మార్చి 31 ప్రభాతవార్త: ఏపి జోన్4 పరిధిలోని ఏ.పీ. మోడల్ స్కూల్స్‌కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం వెంకటగిరిలోని ఎపి మోడల్ స్కూల్ నందు జోనల్ స్థాయిలో ఐఐటి, జేఈఈ ఈఏపీ సెట్ కోచింగ్ నెల రోజుల కార్యక్రమం ప్రారంభమవుతుందని ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.తులసి జ్యోతి తెలిపారు. ఈ కోచింగ్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఏప్రిల్ 1 నుండి 30 వరకు నిర్వహించబడుతుందని ఆమె తెలిపారు. ఈ శిక్షణ కొరకు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసుకొని ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో, జోన్ 4 పరిధిలో ఎంపికయిన మొత్తం 100 మంది బాలురకు ఈ ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని ఆమె తెలిపారు. ఈ కోచింగ్ కార్యక్రమాన్ని ఎపి ప్రభుత్వం ప్రయోజనకరంగా నిర్వహిస్తుందని, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా, ఏఎంఒ కె. కృష్ణవేణి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచులే కీలకం : ఎంపీపీ

వెంకటగిరి, మార్చి 31 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్ర అని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి తెలిపారు. ఏప్రిల్ నెల రెండో తేదీతో సర్పంచుల పదవీకాలం ముగియను ఉండడంతో వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచలను సత్కరించి వీడ్కోలు పలికారు. గత ఐదు సంవత్సరాలు పాటు సర్పంచులందరూ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేశారని చెప్పారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను మండల పరిషత్ సమావేశాల్లో చెప్పేవారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మస్తాన్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువే జీవన మెరుగుదలకు మూలాధారం

చిట్టమూరు, మార్చి 31 ప్రభాతవార్త: కుటుంబ జీవనాధారంకు చదువు మూల కారణమని తద్వారా ఆయా జాతుల కుటుంబాలు ఎంతో మెరుగుపడి సమాజంలో గౌరవ ప్రధమైన స్థితిలో ఉంటాయని చిట్టమూరు తాసిల్దార్ రామయ్య తెలియజేశారు. మంగళవారం అరవ పాలెం పంచాయతీ పరిధిలోని చిన్న దరఖాస్తు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం జరిపారు. స్థానిక సర్పంచ్ నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, మండల అధికారులతో ఈ దినోత్సవానికి తహసిల్దార్ వన్నె తెచ్చారు. గత వారం ప్రభాతవార్తలో ప్రచురితమైన జానడు జాగాకు చోటేది అనే కథనానికి తీవ్రంగా స్పందించిన ఆయన అన్ని శాఖల అధికారులను గిరిజన కాలనీకి రప్పించి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన, దళితులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా అట్రాసిటీ కేసుల విషయంలో అవగాహన అవసరమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కాశీ నాయక్, సర్పంచి రాజేష్ రెడ్డి ఆర్ఐ సుధా, హౌసింగ్ ఏఈ సుధీర్ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ గురవయ్య, మహిళా పోలీస్ సుజాత,వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి ఏపిఎం గున్నయ్య, వీఆర్వో కోటయ్య, భాజపా మాజీ మండలాధ్యక్షులు దువ్వూరు శరత్ చంద్రారెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులు నాగరికతకు చిహ్నాలు

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త : రహదారులు నాగరికతకు చిహ్నాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. మంగళవారం రూరల్ మండల పరిధిలోని తడుకు పంచాయతీలో తిమ్మరాజు కండ్రిగ నుంచి వేణుగోపాలపురం వరకూ ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లినపుడు స్థానిక గ్రామస్తులు ఈ రోడ్డు నిర్మించాలని కోరారు. అప్పట్లో తాను ఎమ్మెల్యే అయితే తప్పక రోడ్డు నిర్మాణం చేపడతానని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు గత రెండేళ్ల తమ ప్రభుత్వంలో రోడ్ల సదుపాయం కల్పించామని తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), స్థానిక సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొక్కసం పాళెం పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి నిధులు

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం బొక్కసం పాళెం గ్రామ పంచాయతీ మహిళా ఫ్రెండ్లి పంచాయతీగా ఎంపికైంది.ఈ మేరకు గతంలో కేంద్ర బృందం గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ మహిళా సంఘాల చొరవను ఇక్కడ సంఘంగా ఏర్పడి చేపడుతున్న అభివృద్ధిని గుర్తించారు.మహిళా సంఘాలతో కేంద్ర బృందం ముఖాముఖితో అభివృద్ధిని పరిశీలించారు. మహిళలు పాడిపరిశ్రమ అభివృద్ధిలో చేపడుతున్న చర్యలను గుర్తించారు.ఈ బృందం ప్రత్యేక నివేదికను అందించారు.

అభివృద్ధికి రూ.కోటి మంజూరు:

బొక్కసంపాళెంలోని మహిళలు అందరూ కలసి గ్రామాభీవృద్ధికి నడుం బిగించారు.చేయి చేయి కలిపి ముందడుగు వేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. దాంతో కేంద్రం దృష్టిలో పడ్డారు. నిధులు సాధించారు.గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే తీరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించిన పంచాయతీలను 'జాతీయ అవార్డులకు ఎంపిక చేసారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఇటిసి కేంద్రంలో శిక్షణ పొందిన రెండు గ్రామ పంచాయతీలు,ఒక మండల బ్లాక్ జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఇటిసి కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ అమర్‌నాథ్ తెలిపారు. ప్రపంచంలో 106దేశాల్లో 17 సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలు సాధించే విధంగా ప్రమాణాలు నిర్దేశించుకొని 2034 నాటికి లక్ష్య సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించారు.,ఇందులో బాగంగా బారత దేశంలోని సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో సుస్థిరత లక్ష్యాలు సాధించే దిశగా సాగిన గ్రామ పంచాయతీలలో వివిధ విభాగాలను విభజించి జాతీయ అవార్డుకుఎంపిక చేసారు.ఇందులో బాగంగానే శ్రీకాళహస్తి మండలంలోని బొక్కసం పాళెంను మహిళా ఫ్రెండ్లి పంచాయతీగా ఎంపిక చేసారు.ఈ గ్రామ పంచాయతీలో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా వివిధ రంగాల్లో రాణిస్తూ పంచాయతీలో కీలకంగా వ్యవహారించారు.ఈ నేపథ్యంలో కేంద్ర అవార్డుకు ఎంపిక చేసింది.పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డును ప్రదాని చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు.ఈటిసి పరిధిలో రెండు గ్రామ పంచాయతీలు,ఒక మండలం జాతీయ అ వార్డుకు ఎంపిక కావటంతో సీనియర్ ఫ్యాకల్టీ అభినందించారు.

నేటి నుంచి శ్రీ శుకబ్రహ్మాశ్రంలో...వార్షికోత్సవ సంబరాలు

ఆధ్యాత్మిక చింతనకు నిలయం... సామాజిక కార్యక్రమాల్లో ముందంజ

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జీవనది స్వర్ణముఖి తీరాన సుమారు 50 ఎకరాల్లో వెలసిన శుకబ్రహ్మాశ్రమం వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి, ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వాములు మంగళవారం సాయంత్రం ఏర్పాట్లలో తలమునలకై ఉన్నారు. ఆశ్రమంలో చక్కటి షామియానాలను ఏర్పాటు చేసారు.అలాగే వచ్చే అతిధులకు బస ఏర్పాట్లు తో పాటు భక్తులు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినటానికి చక్కటి వేదికను ఏర్పాటు చేసారు. అలాగే ద్యానమందిరాన్ని విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. ఆశ్రమంలో భక్తులకు భోజన వసతిని స్వాములు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. 95 సంవత్సరాల వయస్సులో పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి 16 సంవత్సరాల యువకుని వలె పరుగులు తీస్తు ఇక్కడ సహచరుల ద్వారా ఏర్పాట్లునుచురుగ్గా చేపట్టారు.ఐదు రోజుల పాటు జరిగేధార్మిక కార్యక్రమాల్లో ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి సాధువులు హాజరౌతున్నట్లు పీఠాధపతి వివరించారు. గురుదేవులు పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి 28వ పుణ్యారాధన, స్వామి 113 జన్మ దినోత్సవం, 76వ ఆశ్రమ వార్షికోత్సవం జరుగుతుందన్నారు.

సమాజంలో రుగ్మతల పరిష్కారానికి ఆధ్యాత్మిక చింతనే ఔషధం:

శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమంలో బుదవారం నుంచి ప్రారంభమయ్యే సంబరాలకు సంబందించి ప్రభాతవార్త మంగళవారం ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి మాట్లాడుతూ నేడు సమాజంలో రుగ్మతల పరిష్కారానికి ఆధ్యాత్మిక చింతన ఒక్కటే మార్గమని స్వామి వివరిచారు.నేడు సమాజంలో ఏ ఇంటిలో చూసినా సమస్యలు,అశాంతి అసంతృప్తులు చోటు చేసుకున్నాయన్నారు. దీనికి కారణం జీవుడు భగవద్గీతను మూటకట్టి పెట్టడమే అన్నారు. ప్రతి రోజూ భగవద్గీతలోని ఒక్కొక్క శ్లోకాన్ని

ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి

పఠించినా ప్రశాంతత చోటు చేసుకుంటుందన్నారు.శాంతిని స్థాపించుటకు,లోక కళ్యాణానికి, నేడు చోటు చేసుకుంటున్న ఊహించని ఉప ద్రవాలను ఎదుర్కొటానికి ప్రతి ఒక్కరు భగవద్గీతలో వివరించిన సారాంశాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. శాంతికి ఔషధం ఏ మందుల దుకాణాల్లోనూ దొరకదన్నారు.అది కేవలం సాధువుల ఆధ్యాత్మిక చింతనతోనే సాధ్యమౌతుందన్నారు. శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం వ్యవస్థాకులు సమాజంలో శాంతి సౌభాతృత్వాలకు విద్యాప్రకాశంద స్వామి అందించిన అద్భుతమై ఔషదం 'గీతా మకరందం ' అన్నారు. ఆయన అందించిన ఈ ఆయుధం ప్రపంచ దేశాలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు.సమాజంలో ఉపద్రవాలు సహజమని అయితే వాటిని ఎదుర్కొవటం ఎవ్వరికి సాధ్యం కాదని వాటిని ఓర్చుకునేందుకు ఆధ్యాత్మిక చింతనే సరైన మార్గమన్నారు.ఆధ్యాత్మిక ప్రసంగాలు మనిషి జీవితంలో మార్పు తీసుకువస్తుందని సంపూర్ణానందగిరి స్వామి వివరించారు.

ఎస్పీడీసీఎల్ కొనుగోళ్ల విభాగపు సీజీఎంగా రమణ

తిరుపతి,మార్చి 31ప్రభాతవార్త: ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం పరిధిలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ లో కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. రమణకు పదోన్నతిపై కార్పొరేట్ కార్యాలయంలో కొనుగోళ్ళ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్ గా నియమించారు. ఎస్పీడీసీఎల్ లో ఓ ఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం ప్లానింగ్ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న కే. సంపత్ కుమార్ ను ఓ ఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్. అమర్ బాబుకు సూపరింటెండింగ్ ఇంజనీర్ గా పదోన్నతి కల్పిస్తూ, చిత్తూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈగా నియమించగా, బి. హరికి పదోన్నతి కల్పిస్తూ కార్పొరేట్ ఆఫీసులో ఎనర్జీ ఆడిట్ విభాగపు జనరల్ మేనేజర్ గా నియమించారు. కార్పొరేట్ ఆఫీసులో ఎనర్జీ ఆడిట్ విభాగపు జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్. శ్రీనివాసులును కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా బదిలీ చేశారు. అదేవిధంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. రవి చంద్రశేఖర్, షేక్ చాంద్ బాషా, ఎస్. రామకృష్ణలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగానూ, అసిస్టెంట్ ఇంజనీర్లు ఎం. కవిత, ఎస్. అశోక్ కుమార్, బి. రవికుమార్ లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కన్సెస్ సంస్థపై పరువునష్టం దావా వేస్తా !

- దువ్వూరు మధుసూదన్‌రెడ్డి హెచ్చరిక

వాకాడు, మార్చి 31 ప్రభాతవార్త: కెన్సెస్ సంస్థ ప్రతినిధులు తనపై చేసిన అసత్య ఆరోపణలు, విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ నోట్‌ను తాను పూర్తిగా ఖండిస్తున్నానని మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జి దువ్వూరు మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాకాడు మండలం భౌగోళికంగా లోతట్టు ప్రాంతం కావడం వల్ల ఇక్కడి రైతాంగం తరచుగా ప్రకృతి వైపరీత్యాలకు గురై ఆర్థికంగా నష్టపోతున్న విషయాన్ని తాను చిన్నప్పటి నుండి గమనిస్తూ వచ్చానన్నారు. అటువంటి కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా నాటి నుండి నేటి వరకు క్రమశిక్షణతో, విధేయతతో ఈ ప్రాంత ప్రజల పక్షాన పోరాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం వాకాడు మండలంలో అభివృద్ధి జరుగుతున్న తరుణంలో, కార్పొరేట్ సంస్థలు రొయ్యల సాగు పేరిట వచ్చి భూములను నమ్ముకున్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఈ క్రమంలో కన్సెస్ సంస్థ ప్రతినిధులు వైసీపీ నాయకులతో చేతులు కలిపి, కూటమి ప్రభుత్వ ఆశయాలను నీరుగార్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బూడిదవాగు గ్రామంలోని సర్వే నెం. 123, 125లలో ఉన్న 6.92 ఎకరాల భూమి తమదేనని చెబుతున్న కన్సెస్ సంస్థ ఆ భూమిని ఎవరి దగ్గర కొన్నారో..? అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను బహిరంగంగా ప్రదర్శించాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. తిరుమూరు శ్రీనివాసులు రెడ్డి నుండి ఎంత భూమి కొన్నారో..? ఆ ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాను గానీ, తన అనుచరులు గానీ ఎక్కడా ఎవరి భూమిని ఆక్రమించలేదన్నారు. కేవలం ప్రజల పక్షాన నిలబడి ఈ సంస్థ చేస్తున్న భూదందాలను అడ్డుకుంటున్నందుకే, తనపై బురదజల్లడానికి ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. పాతేటిపాళెంలో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమిని చట్టవిరుద్ధంగా తమ ఆధీనంలో ఉంచుకున్న కన్సెస్ సంస్థ, ప్రశ్నించిన వారిపై ధనబలంతో విష ప్రచారం చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు.

తమ స్వార్థ ప్రయోజనాల కోసం గౌరవప్రదమైన కుటుంబ నేపథ్యం ఉన్న తమపై ఇటువంటి నీచమైన ఆరోపణలు చేసినందుకు తాను కన్సెస్ సంస్థపై నేను పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రజల అభివృద్ధికి సహకరిస్తే ఎవరైనా స్వాగతిస్తారని,కానీ ధనబలంతో రైతుల భూములను, ప్రభుత్వ భూములను కాజేయాలని చూస్తే మాత్రం సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇకనైనా కెన్సెస్ సంస్థ రాజకీయ ఎత్తుగడలు మానుకోకపోతే మీ సంస్థ చేస్తున్న అక్రమాలపై తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం, భూమిని నమ్ముకున్న రైతుల హక్కుల కోసం తన పోరాటం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.

పరిశ్రమల్లో ప్రమాదాల కట్టడికి పక్కా చర్యలు : కలెక్టర్



చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త: జిల్లాలోని రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల కట్టడికి పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని పరిశ్రమల యాజమానులు, అధికారులతో పరిశ్రమల్లో ప్రమాదాల నియంత్రణపై ముందస్తు చర్యలు అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి ఫ్యాక్టరీల్లో పని చేసే ప్రతి ఒక్కరికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పరిశ్రమలో సంబంధిత అధికారుల సమక్షంలో తప్పనిసరిగా మాక్ డ్రిల్ నిర్వహించాలని, సంబంధిత అధికారులు కచ్చితంగా మాక్ డ్రిల్‌కు హాజరు కావాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల సమయంలో తీసుకునే చర్యలపై అవగాహన కల్పించేలా ఫైర్, పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో పైపులైన్ల ద్వారా ప్రమాదకర రసాయనాలు రవాణా జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీస్ ఛీఫ్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సురేష్‌బాబు, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శంకర్‌రెడ్డి, డిఎస్పీ మహబూబ్‌భాషా, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన డిఎస్పీగా గీతాకుమారి



తిరుపతి,మార్చి 31ప్రభాతవార్త: తిరుపతి నగరంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సిగ్నల్ పాయింట్ల వద్ద నియమాలతో వాహనాలను నడపాలని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ గీతాకుమారి తెలిపారు. నిబంధనలు పాటించకుంటే ఈచలానాలు విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఆమె కోరారు. తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌వీయూలో అక్రమాలపై విద్యార్థి సంఘాల నిరసన



తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్‌వీయూ)లో జరుగుతున్న అక్రమాలపై విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. రిజిస్ట్రార్ భూపతి నాయుడును తక్షణం సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎస్‌వీయూలో విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనం తరం వారు మాట్లాడుతూ, రిజిస్ట్రార్ నిబంధన లకు విరుద్ధంగా అక్రమంగా ఉద్యోగాలు కల్పిస్తూ లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు.అనుమతులు లేకుండా తన అనుచరులకు ఉద్యోగాలు ఇస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతూ, కులం పేరుతో దూషణలు చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన నవసమాజ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్‌ను కులం పేరుతో అవమానించడం తీవ్రంగా ఖండిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సుందర్ రాజు ప్రేమ్ కుమార్, అమృత తేజ, శివబాలాజీ, యుగంధర్, సుకుమార్, మురళి, చందనాయుడు, విజయ్ ఉత్తరాదిలు పాల్గొన్నారు.

పదవీ విరమణ పోలీస్ సిబ్బందికి సత్కారం



తిరుపతి,మార్చి 31ప్రభాతవార్త:తిరుపతి జిల్లాలో పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ ఘన సత్కారం చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుఆధ్వర్యంలో పదవీవిరమణ చేసిన ప్రతి ఒక్కరికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ యూనిఫామ్ ఒక గొప్ప బాధ్యతను, గౌరవాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగం అత్యంత బాధ్యతగలదని, ప్రతి అధికారి తన విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తే సమాజంలో శాంతి, భద్రత నెలకొంటుందని ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ పొందిన డిఎస్పీ రామకృష్ణమాచారి, ఏఎస్ఐ లు కోదండరాం, ప్రభాకర్ రావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరచారి, శ్రీనివాసులు, ఏవో సురేష్ కుమార్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖరరెడ్డి, శంకర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి!



రేణిగుంట మార్చి 31 ప్రభాతవార్త : రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో గాజులమండ్యం గ్రామం నుండి తండ్లం వెళ్లే మార్గంలో నాగార్జున రెడ్డి సిమెంట్ బ్రిక్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తుతెలియని కుమార్ 40 సంవత్సరాల యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. రూరల్ సీఐ మంజునాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి సుమారు 40 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. తల వెంట్రుకలు నలుపు తెలుపు రంగులో ఉండి ఒంటిపై ఆకుపచ్చ నల్ల గళ్ళ ఫుల్ షర్టు, గోధుమ రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ముఖం పైన గాయాలు ఉండడంతో వీఆర్ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ ఉద్యోగికి వీడ్కోలు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీర్ఘకాలం పని చేసిన దామోదరం మంగళవారం రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు వీడ్కోలు, సన్మాన సభను ఆలయ ఇఒ బికె వెంకటేశులు అధ్యక్షతన గురుదక్షిణా మూర్తి అలయం వద్ద సన్మాన సభను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మాట్లాడుతూ ఉద్యోగులకు విరమణ సహజమే అన్నారు. అయితే ఆధ్యాత్మిక నిలయంలో సుమారు 40 సంవత్సరాల పాటు ఉద్యోగం నిర్వహించిన దామోదరం అభినందనీయుడు అన్నారు. ప్రతి రోజూ స్వామి సేవలో పాల్గొనటం ఆయన పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమే అన్నారు. ఆయన మూడేళ్ల ముందే రిటైర్డ్ కావాల్సి ఉండగా ప్రభుత్వం పెంచిన వయస్సుతో మరో రెండేళ్ల పాటు శివయ్య సేవలో గడిపారన్నారు. ఆయన ఏ శాఖలో పని చేసినా మంచిపేరు తెచ్చుకున్నారని అభినందించారు. ఈ సందర్బంగా ఆయనకు దుశ్శాలువతో సత్కరించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలతో పాటు దామోదరం దంపతులకు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఒలు మోహన్, హేమామాలిని, విద్యాసాగర్‌రెడ్డి లోకేష్‌బాబు, సూపరింటెండెంట్‌లు విజయసారధి, నాగభూషణం యాదవ్, రవి, సీనియర్ అసిస్టేంట్లు హరియావ్, వెంకటస్వామి, సుదర్శనం నాయుడు, దఫేదార్ దాము, ఇఇ శ్రీనివాసులురెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ అరుదైన జబ్బుల పై అవగాహన గురించి కార్యశాల

తిరుపతి హెల్త్, మార్చి 31, ప్రభాతవార్త

ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం వారు ఒక్క రోజు కార్యసాలను దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, చిన్న పిల్లల పీజీ, వైద్య విద్యార్థులు, ఈ కార్యాశాలలో పాల్గొని సందేహాల నివృత్తి, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఇలాంటి కార్యశాలలో ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ తెలిపారు. ప్రిన్సిపాల్ డా. జి రవిప్రభు, మెడికల్ సూపరింటెండెంట్ డా. జె రాధ, జిఎంహెచ్ సూపరింటెండెంట్ డా ప్రమీల దేవి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వివిధ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు (తిరుపతి, స్విమ్స్) 70 మంది, పిల్లల విభాగం అధ్యాపకులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు, తిరుపతి పిల్లల వైద్యులు పాల్గొన్నారు. డా. అంజన్ కుమార్, డా. మనోహర్ కోర్డినేటర్స్‌గా వ్యవహరించారు. ఫాకల్టీగా డా. అశ్విన్ దళాల్, డా. షగున్ అగర్వాల్, డా. ప్రజ్ఞ రంగనాథ్, డా రూప దర్శిని బాలన్, హైదరాబాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి అమీర్ మొహమ్మద్ జుబైర్ ఖాన్, సనోఫీ హెల్త్ ఇండియా(ప్రై) లిమిటెడ్ సమీద్దీన్ అహమద్ సహకారం అందించారు.

కరుణాకర్ రెడ్డి మాట్లాడే ప్రతి మాట అపద్ధమే

తిరుపతి హెల్త్, మార్చి 31, ప్రభాతవార్త :

కరుణాకర్ రెడ్డి తిరుచానూరు ఆలయానికి సమీపంలోని ప్రభుత్వ భూములను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు దుష్ప్రచారం చేయడం చాలా దారుణమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం ఆయన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తమ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ని విమర్శించే స్థాయి కరుణాకర్ రెడ్డికి లేదన్నారు. వైసీపీ పాలనలో తిరుపతిలో డీకేటి ప్రభుత్వ భూములను కబ్జా చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు, ఆర్థికంగా ఎదుగుదలకు అవకాశం కల్పిస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రైవేట్ హోటల్‌కి ప్రభుత్వ ధర ప్రకారమే స్థలాన్ని ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి వారికి ఇచ్చారన్నారు. స్థలాన్ని కేటాయించిన వ్యక్తులకు గాని, సంస్థలకుగాని, లోకేష్ బాబుకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బినామీ వ్యక్తులతో స్థలాలు సేకరించాల్సి నంత అవసరం మంత్రి లోకేష్‌కి లేదన్నారు. కరుణాకర్ రెడ్డికి శాపం ఉందని, ఆయన మాట్లాడే ప్రతి మాట అపద్ధమే అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా సర్వనాశనాశనం చేశారని విమర్శించారు. అభివృద్ధి అంటే మీ వైసిపి భాషలో గంజాయి సెంటర్లు , మీ నాయకులు బయట రాష్ట్రాలలో స్థిరపడడం కాదని అవహేళన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర అభివృద్ధి పరుగులు తీస్తుందని తెలిపారు. కరుణాకర్ రెడ్డి, వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వం చేస్తున్న తిరుపతి అభివృద్ధిని ఓర్వలేక అడ్డుపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రుయా ఆసుపత్రికి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి. మనోహర్

తిరుపతి హెల్త్, మార్చి 31, ప్రభాతవార్త

తిరుపతిలోని ఎస్.వి.ఆర్.ఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏడీ.ఎం.ఈ/సూపరింటెండెంట్ పోస్టులలో, పదవీ విరమణ వయస్సును పూర్తిచేసి 31.03.2026న పదవీ విరమణ చేసిన డాక్టర్ జె.రాధ, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు ఎఫ్ఏసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఉత్తర్వులు జారీ చేసారు. తిరుపతిలోని ఎస్.వి.ఆర్.ఆర్. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సూపరిటెండెంట్‌గా డాక్టర్ బి. మనోహర్‌ని చిన్నపిల్లల విభాగాధిపతి, రుయా ఆసుపత్రి, ఎస్ వి వైద్య కళాశాల, రుయా సూపరింటెండెంట్‌గా ఎఫ్ఏసి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డా. డి.ఎస్.ఎన్ మూర్తి, డాక్టర్ ఏ ఎస్ కిరీటి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ హరికృష్ణ, పరిపాలనాధికారి రమేష్, గిరి ప్రసాద్, రుయా పరిపాలన సిబ్బంది, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి పాలకమండలి పరిధి కాదు, ప్రభుత్వ అంశం

- బ్యాంకు ఉద్యోగులకు పాలకమండలి మద్దతు
- టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి హెల్త్, మార్చి 31, ప్రభాతవార్త

గత ఐదు రోజులుగా టౌన్ బ్యాంక్ ఉద్యో గస్తులు పిఆర్‌సి అంశంపై నిరసనలు చేస్తున్నా రని, పిఆర్‌సి అంశం పాలక మండలి పరిధి లోకి రాదని, ప్రభుత్వ పరిధిలోని అంశమని టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, ఆర్ సి మునికృష్ణ వారికి మద్దతు తెలపడం పట్ల పిఆర్‌సి అంశం పాలకమండలికి సంబంధం లేదు అనే అంశం వాళ్లకు తెలియదా? అని ప్రశ్నించారు. ఇక్కడికి వచ్చి వాళ్లకు మద్దతు తెలిపే బదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరికి మీరందరూ వెళ్లి పిఆర్‌సిని విడుదల చేయాలని, ఉద్యోగస్తులందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పొచ్చు కదా అని అన్నారు. సుమారు 12 సంవత్సరాలు టౌన్ బ్యాంక్ చైర్మన్ గా ఉన్న పులిగోరు మురళీకృష్ణారెడ్డికి రూల్స్ తెలియవని పేర్కొన్నారు. గతంలో కూడా ఎంప్లాయిస్ కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్న తర్వాతనే పాలకమండలి పిఆర్‌సిని ప్రకటించిందని గుర్తు చేశారు. ఉద్యోగస్తులు కోర్టుకెళ్లి ఆర్డర్ తీసుకు వస్తే పాలక మండలి సమావేశంలో పెట్టి మేము ఇస్తామని చెప్పారు. పులిగోరు మురళీకృష్ణారెడ్డికి కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం పైన కుట్రతో బ్యాంకు ఉద్యోగస్తులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం మీద వ్యతిరేకతను తెలియజేస్తూ ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పాలక మండలి తరఫున ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టకుండా పులిగోరు మురళీకృష్ణ రెడ్డికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కోరుతున్నాం అన్నారు. కోపరేటివ్ టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు వాసు దేవ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ చదరంగంలో బ్యాంకు ఉద్యోగస్తులను పావులుగా వాడుకుంటున్నదని అన్నారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి ఉద్యోగస్తులకు మద్దతుగా రెండుసార్లు పిఆర్సి పైన సంబంధిత ఐఎఎస్ అధికారికి రికమెండ్ చేయడం జరిగిందని, ఎన్ పిఏ అధికంగా ఉండటం పట్ల పిఆర్సి వీలు కాలేదన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్స్ అమర్నాథ్ రెడ్డి, మాకం చంద్ర, బ్రహ్మానంద రెడ్డి, మహమ్మద్ ఖాసిం, జ్యోతి ప్రకాష్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

పుత్తూరు రూరల్, మార్చి 31 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని కాపు వీధిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి(నోముల గుడి) ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో వైభవంగా సీతా కల్యాణం ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే విద్యుత్ దీపాలంకరణతో శ్రీరాములవారు సీతాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాన్ని మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

చలివేంద్రం ఏర్పాటు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని కొత్త పేట శీతలాంబ దేవి అలయం వద్ద మంగళవారం ప్రముఖ రాజకీయ నాయకుడుపాల మంగళం రవి సారధ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసారు. భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ నుంచి పయనమౌ తుంటారు కాబట్టి ఇక్కడ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. మొదటి రోజు ఇక్కడ చల్లని అంబలి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఆశోక్, కంచిముని కృష్ణయ్య, హేమంత్ ప్రకాష్, బత్తిరెడ్డి, శివ, పల్లం గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం శాశ్వతం కాదు: మనం అందించే సేవలే శాశ్వతం

అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త మనం ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదు. మనిషి జీవితంలో ఉద్యోగం శాశ్వతం కాదు. మనం చేసిన మంచిపనులు, ప్రజా సేవే పది కాలాల పాటు మనల్ని గుర్తిండేటట్టు చేస్తుందని శ్రీకాళహస్తీశ్వరాలయ దర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని ఆర్టిసి డిపోలు ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురిని ఆయన సత్కరించారు. డిపోలో దీర్ఘకాలం పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్ వి.రమేష్‌బాబు, మెకానిక్ చెంగల్‌రాయులు మరో డ్రైవర్ ఎం.రమేష్‌బాబులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగంలో మనం చేసిన మంచిపనులు పది కాలాల పాటు గుర్తుండేటట్లు చేస్తుందన్నారు. నేడు ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు తమ విధి నిర్వహణలో ఎంతోజవాబుదారితనంగా పనిచేసారన్నారు. డ్రైవర్ అంటే ఒక్కొక్క సారి 60మంది ప్రాణాలతో ప్రయాణమే అన్నారు. అలాంటి బాధ్యతా యుత ఉద్యోగంలో ఎలాంటి రిమార్కుల్లేకుండా పని చేసి నేడు ఉద్యోగ విరమణ చేయటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతోపాటు యూనియన్ నాయకులు పసుపులేటి శ్రీనివాసకుమార్, రోశయ్య, మురళి, సిసి రావు, రామకృష్ణ, బాలాజి, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల పరిశీలనే కీలకం: ప్రతి ఇంటిలో పరిశీలించండి

కోలా ఆనంద్ పిలుపు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త 'ఓటర్ల జాబితా పరిశీలనలో బిజెపి కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల జాబితా ఓటర్లను పరిశీలించాలని రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పిలుపు నిచ్చారు. మంగళవారం శ్రీకాళహస్తిలో జరిగిన ప్రత్యేక సమగ్ర సర్వే కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఇక్కడ పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సర్వే కోసం జిల్లా స్థాయి కార్యశాలను ఏర్పాటు చేసారు. జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా స్థాయి నాయకులుఈసందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టిన తరువాత భారత దేశ సమగ్ర స్వరూపాన్ని మార్చి వేసారన్నారు. నేడు రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని ఎంతో ఆర్థిక సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతను పెంపొందించే దిశగా క్షేత్ర స్థాయిలో బిజెపి కార్యకర్తలను బిఎల్ఓలుగా బియల్‌ఏలుగా నియమించుకొని అధికారులను సమన్వయం చేసుకుంటూ తప్పులు లేని ఓటరు జాబితాలను రూపొందించటంలో నాయకులను కార్యకర్తలకు దిశ దెశ నిర్దేశం చేసారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయించు బాద్యతను బిజెపి కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. ఈ మిడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శులు మట్టా ప్రసాద్, సన్నారెడ్డి తరదయాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షుడుచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన గుడ్లూరు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త రాష్ట్ర20 సూత్రాల కార్యక్రమాల పర్యవేక్షణ కమిటి చైర్మెన్ కెబినెట్ మంత్రి లంక దినకర్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఆయనకు ఎంజిఎం అధినేత గూడ్లూరు మయూర్ ఆయన తండ్రి గుడ్లూరు మల్లికార్జున్ నాయుడులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేసారు. తరువాత ఎంజిఎం గ్రాండ్‌లో ఆయనను సత్కరించారు. మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి అబివృద్దికి పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్దికి కేంద్ర బిందువు అవుతందని వివరించారు.

మంత్రిని కలసిన కన్నవరం

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గాండ్ల బిసి సాధికారిక సమితి రాష్ట్ర సభ్యులు కన్నవరం హరిబాబు రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గాండ్ల, తెలికుల, దేవ తెలికుల కార్పొరేషన్‌ను ఇప్పటి వరకు ప్రకటించలేదని, కార్పొరేషన్ నిర్మాణం చేయాలని అవసరమైన నిధులను అందించాలని అభ్యర్థించారు. ఈ మేరకు మంతికి వినతి పత్రం అందించారు.

విద్యాప్రకాశానంద డిగ్రీ కళాశాలలో మోటివేషన్ సభ

తొట్టంబేడు, మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మోటివేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహా వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా టెక్సాస్ కాలేజ్ వైస్ చైర్మెన్, రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రియాజ్‌బాషా హాజరయ్యారు. కో ఫౌండర్ సిఇఒ సీనియర్ సైంటిస్టు సల్లా గుండ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రియాజ్ బాషా మాట్లాడుతూ తాము గ్రామీణ నేపథ్యం నుంచి అత్యున్నత స్థాయికి ఎలా చేరుకున్నారో ఉదాహరణలతో వివరిచారు. సల్లా గుండ్ల మాట్లాడుతూ క్రమశిక్షణ నిరంతర కృషి ఉంటే భౌగోళిక సరిహద్దులు అడ్డంకి కాదని ధైర్యం, ఉత్సాహం ఉంటుందన్నారు. విద్యార్థులు పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టి గంగాధరం, డాక్టర్‌మునెయ్య, శ్రీరామసుకుమార్, రాజేంద్రుదు, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

గిరిజన భూములకు రక్షణ కల్పించండి:

భూముల్లో చెట్లు నాటిన గిరిజనులు

తొట్టంబేడు, మార్చి 31 ప్రభాతవార్త మండలంలోని గిరిజన భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఎపి గిరిజన సంఘం సారధ్యంలో అక్రమిత భూముల్లో చెట్లను నాటారు. మంగళవారం ఎపి గిరిజన సంఘం తరపున ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్‌రెడ్డి సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ నేడు దళిత గిరిజన భూములను కొందరు పలుకుబడి కల్గిన వారు అక్రమించుకుంటూ గిరిజనులకుద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానికంగా ఉన్న ఎరుకుల కులానికి చెందిన 30 కుటుంబాలకు 1987లో డికెటి పట్టాలు ఆక్రమంలోనే కంపారాజమ్మకు 2.78 ఎకరాల భూమిని ఇవ్వటం జరిగిందన్నారు. ఆమె మరణాంతరం ఆమె కుమారుడు కంపా గోపాల్ ఆభూమిలో వరి, మినుములు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. ఈ గ్రామానికి చెందిన పముజుల నరసింహులునాయుడు, జిరత్నయ్యనాయుడులు, గోపాల్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి పంటలు సాగుచేసుకుంటున్నారని ఆరోపించారు. 2023లో రెవెన్యూ పోలీసుల సమక్షంలోభూములను సర్వే చేసి గిరిజనులకు స్వాధీనపరిచి నప్పటికి ఆక్రమణ దారులు భూమూల్లోకి రానివ్వకుండా పెత్తందారులు అడ్డుకకుంటున్నారని వాపోయారు. ప్రతిఘటనలో భాగంగా అక్రమిత భూమిలో కొబ్బరి చెట్లను నాటారు. ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టెటి ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు గంధం మణి, అంగేరి పుల్లయ్య రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

యూనివర్సిటీల సమస్యలపై గళమెత్తిన ఎస్ఎఫ్ఐ

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త

రాష్ట్ర యూనివర్సిటీలలో కొనసాగుతున్న సమస్యలపై స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) గళమెత్తింది. రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్‌ను ఏప్రిల్ 3, 4 తేదీలలో కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా ఎస్వి యూనివర్సిటీ కమిటీ సభ్యులు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షురాలు పి. పవిత్ర, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర యూనివర్సిటీల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3371 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయడం లేదని విమర్శించారు. యూనివర్సిటీల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని, రీసెర్చ్ విద్యార్థులకు రూ.20,000 వరకు ఫెలోషిప్ ఇవ్వాలని, యూనివర్సిటీ విద్యార్థులకు నెలకు రూ.3,000 మెస్ బిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని యూనివర్సిటీల్లో రోహిత్ వేముల చట్టాన్ని అమలు చేయాలని, ప్రైవేట్ యూనివర్సిటీల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూలులో జరగనున్న ఈ రాష్ట్ర కన్వెన్షన్‌లో యూనివర్సిటీల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కన్వెన్షన్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కమిటీ సభ్యులు చక్రి, అనిత, వెంకటలక్ష్మి ్మ, మహేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

42 రోజుల సమ్మె హామీలను అమలు పరచాలి : సిఐటియూ

పుత్తూరు రూరల్, మార్చి 31 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 42 రోజుల సమ్మె హామీలను అమలు పరచాలని మంగళవారం అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 42 రోజులుగాసమ్మెను హామీలు అమలు చేయాలని, వారికి వేతనాలు పెంచాలని, అదే విధంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ల రద్దుచేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు విజయకుమారి, మునికుమారి, కృష్ణవేణి, జయంతి, లలిత, దుర్గ, ధనమ్మ, గంగులమ్మ, హైమావతి, అన్నపూర్ణ, సూపర్‌రత్న, సునీత, మంజుల, లత, లక్ష్మి, మునిలక్ష్మి పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో కల్యాణోత్సవం

విజయపురం, మార్చి 31 ప్రభాతవార్త: మండల కేంద్రమైన విజయపురం కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో వేద పండితుల ద్వారా పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పురోహితులు వందవాసి మహేష్‌శర్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మందకృష్ణ వ్యాఖ్యల పై

తిరుపతి, మార్చి 31ప్రభాతవార్త: బ్రాహ్మణులు దేవతలా అంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. అర్చకత్వం రద్దు చేయాలని ఆయన డిమాండ్ ను వేదం హరిప్రసాద్ ఆక్షేపించారు. యుగాలుగా పూజా విధానం మంత్ర పట్టణం వేదాలు చదువుతున్నది నేర్పుతున్నది బ్రాహ్మణులైననే గుర్తు చేశారు. ఈరోజుటికీ హిందుత్వం ప్రజల్లో ఉంది సంస్కృతి సంప్రదాయాలు నిలబడుతున్న ఎందుకంటే కారణం బ్రాహ్మణులు చేస్తున్న ఎన్నో బ్రాహ్మణులు పట్టు ప్రజల్లో ఉన్న టువంటిగౌరవంవీటిని అన్నిటినీ కించపరిచే మంద కృష్ణ మాదిగ మాట్లాడడం తగవని హితువు పలికారు.

కన్నుల పండువగా ఊంజల సేవ

తిరుపతి, మార్చి 31ప్రభాతవార్త: తిరుపతి పెద్దకాపు వీధిలో వెలసిన శ్రీరామ భజన మందిరంలో నవమి ఉత్సవాలు కన్నుల పండు గగా జరుగుతున్నాయి. మంగళవారం సా యంత్రం సీతారాములకు ఊంజల సేవ కడు రమణీయంగా నిర్వహించారు. స్థానికులు ఈ ఊంజల సేవలో పాల్గొని సీతారాములను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుపతి పెద్దకాపు వీధి శ్రీ కృష్ణ యాదవ సంఘం వారు ఊంజల సేవలో ఉభయదారుల వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి చంద్రశేఖర్ రెడ్డి ,పెద్దకాపు వీధి శ్రీకృష్ణ యాదవ్ సంఘం నాయకులు చింతా భరణి యాదవ్, భాస్కర్ యాదవ్, గురవయ్య ,వెంకటేష్ యాదవ్ ,ఈతమాకుల శైలేంద్ర ,బత్తయ్య , తొండము నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి ,విజయమ్మ ,రాజా లక్ష్మమ్మ, నారాయణ రెడ్డి ,తదితర భక్తులు పాల్గొన్నారు

సామాజిక బాధ్యతగా మహిళా సాధికారత

యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 31 ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం నిర్వహించుచున్న " స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా అప్పేరల్ డిజైయినింగ్ మరియు కంప్యూటర్ ఎంబ్రాయిడరి " పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కిల్ డెవలప్మెంట్ కి సంబంధించి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి మహిళలలో సాధికారత పెంపొందించడమే లక్ష్యంగా సామాజిక బాధ్యతగా తమ వంతు సహాయాన్ని అందిస్తూ గోదావరి బ్లాక్ లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వి. ఉమ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడానికి వివిధ నైపుణ్యాలు కలిగి ఉండడం అవసరమని తెలుపుతూ ముఖ్యంగా టైలరింగ్ ,కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వంటి నైపుణ్యాలను మహిళలకు, విద్యార్థినులకు మరియు సిబ్బందికి యొక్క జీవనోపాధికి అవసరమైన అవకాశాలు విస్తృతంగా కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్‌పి.శ్రీనివాస కుమార్ ,ఎల్ ఎస్ వి ఆర్ శర్మ, మహిళా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.ఉష, మహిళా విశ్వవిద్యాలయ ఫార్మర్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని, ఎస్.స్వాతి, బ్రాంచ్ మేనే జర్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఫిజిక్స్ విద్యార్థుల విజ్ఞాన పర్యటన

పుత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త : విద్యార్థుల అభ్యాసంలో తరగతి గది బోధన మాత్రమే కాకుండా క్షేత్ర పర్యటనలు ముఖ్య పాత్ర పోషిస్తాయని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజిక్స్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ జి.సురేష్‌బాబు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు విజ్ఞాన పర్యటనలో భాగంగా మంగళవారం కల్యాణపురంలోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని ఇవ్వడమే కాకుండా పాఠ్యాంశాలపై లోతైన అవగాహన కల్పిస్తాయని తెలిపారు. పాల శీతలీకరణ కేంద్రంలో పనిచేసే నిపుణులు వివిధ రకాలైన పరికరాలు పనిచేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. 35 డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి 4 డిగ్రీలకు తగ్గించే పద్ధతిని తెలిపారు. వివిధ రకాల పాల నాణ్యతను పరీక్షించే యంత్రాల పనితీరు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.సుజల స్వప్న, స్మిత, డాక్టర్ టి.రఘురామన్ తదితర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీపిసెట్ విద్యార్థులు 177 మందికి ఉద్యోగాలు

పుత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ పెరుమాళ్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 177 మందికి పలు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించి నట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కాలేజీలో జరిగిన మెగా ప్లేస్‌మెంట్ ఎక్స్‌పోలో టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాయి. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు కాలేజీ వైస్‌ఛైర్మన్ రావూరి బాలాజీ అభినందనలు తెలిపారు. తమ కాలేజీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్కైవోల్ట్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సుమారు 200 మందికి పైగా తమ కాలేజీకి చెందిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించి పుత్తూరు పరిసర ప్రాంతాల్లో మొదటి కాలేజీగా గుర్తింపు పొందిందని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.పి.నాగరాజ్‌రావు తెలిపారు.